గురువారం
21-12-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 179
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

టెలీ కమ్యూనికేషన్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

న్యూఢిల్లీ: కేంద్రం కొత్తగా తీసుకొచ్చిన టెలికమ్యూనికేషన్స్ బిల్లును లోక్‌సభ ఆమోదించింది. ఈ బిల్లును కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రవేశపెట్టగా లోక్‌సభ సభ్యులు ఆమోదం తెలిపారు. శాంతి భద్రతలకు, దేశ ప్రయోజనాలకు భంగం కలిగించే పరిస్థితుల్లో టెలికాం నెట్‌వర్క్‌ను ప్రభుత్వం తన నియంత్రణలోకి, నిర్వహణలోకి తెచ్చుకునేందు ఈ బిల్లు దోహదమవుతుంది. అలాగే సందేశాలను వినొచ్చు. ప్రసారాలను నిలిపివేయవచ్చు. కాగా, ఇండియన్ టెలిగ్రాఫ్ యాక్ట్, 1885, వైర్‌లెస్ టెలీగ్రఫీ యాక్ట్ 1993, ది టెలీగ్రఫీ వైర్స్ యాక్ట్ 1950 స్థానంలో కొత్త బిల్లును తెచ్చారు.

మోదీ సర్కారు
కక్షసాధింపు

- సస్పెండైన ఎంపీలపై ఆంక్షలు
- పార్లమెంటు ఆవరణలోకి ప్రవేశం లేదు
- లోక్‌సభ సెక్రటేరియట్ సర్క్యులర్

న్యూఢిల్లీ: విపక్ష ఎంపీలపై మోదీ సర్కారు కక్షసాధింపు చర్యలు కొనసాగుతున్నాయి. సస్పెన్షన్‌కు గురైన ఎంపీలను పార్లమెంటు ఆవరణలోకి రాకుండా ఆంక్షలు విధించింది. ఇందుకు లోక్‌సభ సెక్రటేరియట్‌ను ఉపయోగించుకుంది. పార్లమెంటులో భద్రతా వైఫల్యంపై కేంద్రహోంమంత్రి అమిత్‌షా అధికారిక ప్రకటన చేయాలంటూ విపక్ష ఎంపీలు డిమాండు చేస్తున్న నేపథ్యంలో సభా కార్యకలాపాలకు అడ్డుతగులుతున్నారనే సాకుతో ఉభయసభల్లో మొత్తం 141 మంది ఎంపీలపై సస్పెన్షన్ వేటు పడింది. వీరిపై లోక్‌సభ సెక్రటేరియట్ ఆంక్షలు విధించింది. ఈ ఎంపీలు పార్లమెంటు ఛాంబర్, లాబీతోపాటు గ్యాలరీల్లోకి ప్రవేశించడానికి వీలులేదని ఆదేశిస్తూ సర్క్యులర్ జారీ చేసింది. సస్పెన్షన్‌కు గురైన ఎంపీలు పార్లమెంట్ ఛాంబర్, లాబీ, గ్యాలరీల్లోకి రాకూడదని, పార్లమెంటరీ కమిటీల నుంచీ వారు సస్పెండ్ అయినట్లేనని పేర్కొంది. లిస్ట్ ఆఫ్ బిజినెస్‌లో వారి పేర్లతో

- మిగతా 2 లో

ఆగని సస్పెన్షన్ల పర్వం
మరో ఇద్దరిపై వేటు
మిగిలింది 41 మందే
2లో

వైసీపీ ఓటమి ఖాయం

లోకేశ్ 'యువగళం' ముగింపు సభలో చంద్రబాబునాయుడు



- త్వరలో టీడీపీ-జనసేన ఉమ్మడి మేనిఫెస్టో
- జగన్‌ను ఇంటికి పంపిస్తాం: పవన్
- పాదయాత్ర పాఠాలు నేర్పింది: లోకేశ్

విశాలాంధ్ర-విజయనగరం: ఎన్నికల కురుక్షేత్ర యుద్ధంలో వైసీపీ ఓటమి ఖాయమని టీడీపీ అధినేత చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. విజయనగరం జిల్లా పోలిపల్లిలో టీడీపీ నిర్వహించిన 'యువగళం-నవశకం' సభ ద్వారా టీడీపీ-జనసేన ఎన్నికల శంఖారావాన్ని పూరించాయి. ఎన్నికల పొత్తుపై రెండు పార్టీల అధినేతలు ఈ వేదికపై నుంచి రాష్ట్ర ప్రజలకు స్పష్టత ఇచ్చారు. పవన్, బాలకృష్ణ సభకు హాజరై కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు. నారా లోకేశ్ యువగళం పాదయాత్ర ముగింపు సభకు రాష్ట్ర నలుమూలల నుంచి టీడీపీ, జనసేన కార్యకర్తలు భారీగా తరలి వచ్చారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ... తన 45 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎన్నో పాదయాత్రలు చూశా కానీ, ఎప్పుడూ పాదయాత్రపై దండయాత్ర చేసిన సందర్భాలు లేవు. మొదటి సారిగా సైకో జగన్ పాలనలోనే ఇలాంటి ఘటనలు చూశామన్నారు. ఒక పవిత్రమైన భావనతో పాదయాత్ర చేస్తున్నప్పుడు చేతనైతే సహకరించాలి.. లేదంటే ఇంట్లో కూర్చోవాలి. కానీ, పోలీసులను అడ్డం పెట్టుకుని ఎన్నో ఇబ్బందులు పెట్టారు. యువగళం వలంటీర్లను జైలుకు పంపారు. తప్పకుండా వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తామన్నారు. లోకేశ్ 'యువగళం' పాదయాత్ర ప్రజాగర్జనకు నాంది పలికిందన్నారు. ప్రజలు తమ బాధ, ఆక్రోశం, ఆగ్రహం యువగళంలో చూపించారన్నారు. జగన్‌కు ఒక్క అవకాశం ఇచ్చిన పాపానికి రాష్ట్రం 30ఏళ్లు వెనక్కు వెళ్లిపోయిందన్నారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకిచ్చిన ఏ హామీ నిలుపుకోలేదన్నారు. జాబ్ క్యాలెండర్‌ను ఐదు సార్లు జనవరి నెలలొచ్చినా ప్రకటించలేదని ఎద్దేవా చేశారు. రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ రాలేదన్నారు. యువతకు టీడీపీ-జనసేన ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. యువగళంలో ఎన్నో సమస్యలను తెలుసుకుని ప్రజలతో మమేకమైన లోకేశ్‌ను పార్టీ అధ్యక్షునిగా అభినందిస్తున్నానన్నారు. టీడీపీ అధికారంలో ఉంటే భోగాపురం విమానాశ్రయం, 2020కే పూర్తి చేసేవారమన్నారు. ఉత్తరాంధ్రను వైసీపీ కబ్జా చేసిందన్నారు. ఐదు కోట్ల ప్రజల భవిష్యత్ కోసం అంతా ఆలోచించాలన్నారు. విశాఖపట్నంలో కంపెనీలన్నీ పోయే పరిస్థితి వచ్చిందని, ఉత్తరాంధ్రలో నీటిపారుదల ప్రాజెక్టులన్నీ ఆగిపోయాయన్నారు విశాఖలో సెటిల్మెంట్లు పెరిగాయన్నారు. విశాఖ గంజాయి రాజధాని గా మారిందన్నారు. వైసీపీ వ్యతిరేక ఓటు చీలకూడదన్న పవన్ కళ్యాణ్ వైఖరిని అభినందిస్తున్నానన్నారు. అమరావతి రాజధాని అన్నప్పుడు అంగీకరించిన వారే ఇప్పుడు కాదంటున్నారన్నారు. విశాఖ ఆర్థిక రాజధాని గా అభివృద్ధి చేయాలని అప్పుడే

- మిగతా 2 లో

తల్లావఝ్ఝుల పతంజలి శాస్త్రికి
కేంద్ర సాహిత్య పురస్కారం

న్యూఢిల్లీ: ప్రముఖ తెలుగు కథా, నవలా రచయిత తల్లావఝ్ఝల పతంజలి శాస్త్రి రచించిన 'రామేశ్వరం కాకులు... మరికొన్ని కథలు' అనే లఘు కథల పుస్తకానికి కేంద్ర సాహిత్య పురస్కారం దక్కింది. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులను బుధవారం కేంద్ర సాహిత్య అకాడమీ ప్రకటించింది. కేంద్రసాహిత్య అకాడమీ ఏటా ఉత్తమ రచనలకిచ్చే సాహిత్య అకాడమీ పురస్కారాలను 2023 సంవత్సరానికి ప్రకటించింది. పతంజలిశాస్త్రి రచించిన 'రామేశ్వరం కాకులు...ఇతర కథలు' అనే కథలసంపుటిని తెలుగు గ్రంథాలలో ఉత్తమగ్రంథంగా జ్యూరీ సభ్యులు నిర్ణయించారు. ఆచార్య బేతవోలు రామబ్రహ్మం, ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, డా.పాపినేని శివశంకర్ జ్యూరీ సభ్యులుగా వ్యవహరించినట్లు అకాడమీ ప్రకటించింది. దేశవ్యాప్తంగా 24 భాషల్లో రాసిన కథలను కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాలకు ఎంపిక చేసింది. ఢిల్లీలోని ఫిరోజ్ షా రోడ్డులోని

- మిగతా 2 లో

వలసలు, కరువు నివారణకు
తక్షణమే ఉపాధి పనులు

విజయవాడ ధర్నాలో రామకృష్ణ డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ(గాంధీనగర్): వలసలు, కరువు నివారణకు తక్షణమే ఉపాధి హామీ పనులు ప్రారంభించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం(బీకేఎంయూ) అధ్వర్యంలో బుధవారం విజయవాడ ధర్నాచౌక్ వద్ద వలసలు-కరువు నివారణకు ఉపాధి హామీ పనులు ప్రారంభించి ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ భారీధర్నా చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ధర్నాలో రామకృష్ణ మాట్లాడుతూ కరువు, తుపానుతో రాష్ట్రంలో దుర్భర పరిస్థితులు నెలకొన్నాయని, సన్న, చిన్నకారు రైతులు సైతం వ్యవసాయం చేయలేని పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. ఉపాధి అవకాశాలు లేక వ్యవసాయ కార్మికులు ఇతర రాష్ట్రాలకు వలస పోతున్నారన్నారు. అటువంటి వారిని ఆదుకోవాల్సిన ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని దుయ్యబట్టారు. ఉపాధి హామీ పథకం ఉన్నా...దానిని సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. ఉపాధి హామీ పథకం కోసం ఆందోళనలు చేసినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రామకృష్ణ విమర్శించారు. ఉపాధి చట్టం నిర్వీర్యమే మోదీ సర్కారు లక్ష్యంగా ఉందని మండిపడ్డారు. ఈ పథకానికి 2022-23లో రూ.73 వేల కోట్లు కేటాయించగా, 2023-24లో రూ.61,034 కోట్లకు పరిమితమైందని వివరించారు. ఇది అత్యంత దుర్మార్గం, అన్యాయమని రామకృష్ణ అన్నారు. ఈ చట్టం ప్రధాన లక్ష్యం గ్రామీణ కూలీలకు ఉపాధి కల్పించడమని, తద్వారా గ్రామీణ పేదలకు జీవన భద్రత కల్పించడమన్నారు. రాష్ట్రంలో దుర్భర పరిస్థితులు నెలకొన్నా...సీఎం జగన్‌కు చీమ కుట్టినట్లు కూడా లేదన్నారు. రాష్ట్రంలో 470 కరువు మండలాలు ఉంటే కేవలం 143 మండలాలు ప్రకటించి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. తక్షణం ఉపాధి హామీ పనులు ప్రారంభించి వలసలు, కరువు నివారించాలని డిమాండ్

- మిగతా 2 లో

మోదీ నిరంకుశ చర్యలు, ఎంపీల సస్పెన్షన్‌పై
రేపు రాష్ట్ర వ్యాప్త నిరసనలు

సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ సహా వివిధ పార్టీల పిలుపు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: మోదీ ప్రభుత్వం పార్లమెంటు నుంచి 141 మంది విపక్ష ఎంపీలను సస్పెండ్ చేయడాన్ని ఖండిస్తూ 'ఇండియా' కూటమి పిలుపుమేరకు ఈ నెల 22న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కే రామకృష్ణ, వీ శ్రీనివాసరావు, పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులు ఎన్.మూర్తి, వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.జె.విద్యాసాగర్, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు ఆర్ మణినాయుడులు బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. భారతదేశ పార్లమెంటు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 141 మంది పార్లమెంటు సభ్యులను సస్పెండ్ చేసి మోదీ ప్రభుత్వం సరికొత్త రికార్డు సృష్టించింది. బీజేపీ ఎంపీ ఇచ్చిన సిఫార్సు లేఖ ద్వారా సందర్శకులుగా చెప్పుకొని డిసెంబర్ 13న లోక్‌సభ గ్యాలరీలోకి ఆగంతకులు ప్రవేశించి, పొగబాంబులు వదిలి అలజడి రేపారు. ఈ ఘటనపై, పార్లమెంటులో భద్రతా వైఫల్యాలపై కేంద్ర హోంమంత్రి ప్రకటన చేయాలని సదరు ఎంపీలు డిమాండ్ చేయడమే నేరంగా పరిగణించిన మోదీ సర్కార్ పార్లమెంట్ ఉభయ సభల నుండి ఆయా ఎంపీలను వెలుపలకు గెంటివేసింది. ఇది నరేంద్రమోదీ ప్రభుత్వ నిరంకుశ విధానానికి పరాకాష్ఠ అని వారు పేర్కొన్నారు. ఈ క్రమంలో మోదీ ప్రభుత్వ నిరంకుశ చర్యలను, ఎంపీల సస్పెన్షన్‌లను ఖండిస్తూ ఈ నెల 22వ తేదీన దేశ వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని 'ఇండియా' ఇచ్చిన పిలుపుమేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో చేపట్టే నిరసన కార్యక్రమాల్లో ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఇదీ లోకం!

ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి
ఆట-మాట-పాట

8లో

ప్రజాస్వామ్యం
గొంతు నొక్కారు

- సహేతుక డిమాండ్ చేసినా...గెంటేశారు
- భద్రతా వైఫల్యంపై సమాధానం ఎందుకు చెప్పరు?
- ప్రధాని స్పందనకు నాలుగు రోజులా?
- మోదీ సర్కారుపై సోనియా నిప్పులు

2లో

3,858 పంచాయతీల్లో
కంప్యూటర్లు లేవు

1893 కార్యాలయాలకు సొంత భవనాల్లేవు
కేంద్రమంత్రి మోరేశ్వర్ పాటిల్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో 3,858 పంచాయతీల్లో కంప్యూటర్లు లేవని, 1893 పంచాయతీలకు సొంత భవనాల్లేవని కేంద్ర పంచాయతీరాజ్ శాఖ సహాయ మంత్రి కపిల్ మోరేశ్వర్ పాటిల్ వెల్లడించారు. రాజ్యసభలో బుధవారం వైసీపీ సభ్యుడు విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి రాతపూర్వకంగా సమాధానమిచ్చారు. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు భవనాలు, కంప్యూటర్లు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ఆర్థిక సాయం చేస్తున్నదని కేంద్రమంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆర్జీఎస్‌ఏ పథకాన్ని పునరుద్ధరిస్తూ 2022-23 నుంచి 2025-26

- మిగతా 2 లో

అధ్యక్ష ఎన్నికలకు ట్రంప్ అనర్హుడు

- కొలరాడో కోర్టు చారిత్రక తీర్పు
- క్యాపిటల్ దాడి కేసులో దోషిగా నిర్ధారణ
- సుప్రీంకోర్టుకు వెళతాం: మాజీ అధ్యక్షుడి వర్గాలు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష పీఠాన్ని అధీష్ఠించాలని ఆశలు పెట్టుకున్న మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు కొలరాడో కోర్టు షాక్ ఇచ్చింది. అధ్యక్ష పదవికి పోటీ చేసేందుకు ఆయన అనర్హుడని తీర్పునిచ్చింది. 2021, జనవరి 6న క్యాపిటల్ భవనంపై దాడి కేసులో ఆయనను దోషిగా తేల్చింది. 4-3 మెజారిటీతో చరిత్రాత్మక తీర్పును వెలువరించింది. దీంతో అధ్యక్ష కార్యాలయ బాధ్యతలను చేపట్టేందుకు అనర్హుడిగా కోర్టు ప్రకటించిన మొదటి అభ్యర్థిగా ట్రంప్ అమెరికా చరిత్రలో నిలిచిపోనున్నారు. తాజా తీర్పు మార్చి 5న జరిగే కొలరాడో రిపబ్లికన్ ప్రైమరీ ఎన్నికలకే పరిమితం కాగా నవంబరు 5న జరగాల్సి ఉన్న సార్వత్రిక ఎన్నికలపైనా దీని ప్రభావం తీవ్రంగానే ఉండనున్నది. అయితే ఈ తీర్పుపై ట్రంప్ కావాలంటే అమెరికా సుప్రీంకోర్టును ఆశ్రయించవచ్చని, ఇందుకోసం జనవరి 4వ తేదీ వరకు వీలు కల్పిస్తున్నామని కొలరాడో సుప్రీంకోర్టు తెలిపింది. ట్రంప్ వ్యవహారంలో అమెరికా సుప్రీంకోర్టు తీర్పు వచ్చే వరకు కొలరాడో ప్రెసిడెన్షియల్ ప్రైమరీ బ్యాలట్‌లో నుంచి ఆయన పేరును తొలగించవద్దని అధికారులను ఆదేశించింది. దీంతో సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించనున్నట్లు ట్రంప్ న్యాయబృందం ప్రకటించింది. ఇక సుప్రీంకోర్టు తీర్పుపై ట్రంప్ భవిష్యత్ ఆధారపడినట్లు అయింది. కాగా, 6-3 కన్జర్వేటివ్ మెజారిటీలో ముగ్గురు ట్రంప్ నియమిత వ్యక్తులు ఉండటం గమనార్హం. ఒక వ్యక్తి అధ్యక్ష ఎన్నికలలో పాల్గొనడానికి అనర్హుడని రాజ్యాంగంలోని 14వ సవరణకు సంబంధించిన సెక్షన్ 3 కింద కొలరాడో సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం ఇదే తొలిసారి కావడంతో అధ్యక్ష రేసులో ట్రంప్ పోటీ చేయగలరా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఇదిలావుంటే ట్రంప్‌ను అధ్యక్ష ఎన్నికల్లో పోటీకి అనర్హుడిగా ప్రకటించాలని మినెసోటా, మిచిగన్, ఆరెగాన్ తదితర రాష్ట్రాల కోర్టుల్లోనూ పిటిషన్లు ఉన్నాయి. ఆ రాష్ట్రాల కోర్టులు కూడా కొలరాడో సుప్రీంకోర్టు తీర్పును ఆధారంగా ట్రంప్‌ను అనర్హుడిగా ప్రకటిస్తే ఆయనకు ఎదురు దెబ్బ తప్పదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఇది బైడెన్ కుట్ర : ట్రంప్

కొలరాడో సుప్రీంకోర్టులో తనకు వ్యతిరేకంగా తీర్పు రావడం అధ్యక్షుడు జో బైడెన్ కుట్రగా ట్రంప్ ఆరోపించారు. తనను అధ్యక్ష రేసులో నుంచి తప్పించేందుకు బైడెన్ వర్గాలు శ్రమిస్తున్నాయని, అందులో భాగంగానే ఇది జరుగుతోందన్నారు. అధ్యక్ష ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా రాజ్యాంగాన్ని తీవ్రంగా ఉల్లంఘిస్తున్నారని దుయ్యబట్టారు. 'జో బైడెన్ ప్రజాస్వామ్యానికి ముప్పు. ఘోరంగా ఓడిస్తామని తెలుసు కాబట్టే న్యాయస్థానాలను అస్త్రాలుగా మల్చుకొని ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకుంటున్నారు. నన్ను ఎన్నికల్లో పోటీ చేయకుండా నిలువరించాలని చూస్తున్నారు' అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

ట్రంప్ లేకపోతే నేను తప్పుకుంటా: వివేక్ రామస్వామి

ట్రంప్ పోటీ చేయలేకపోతే తాను కూడా తప్పుకుంటానని రిపబ్లికన్ నేత, అధ్యక్ష అభ్యర్థి వివేక్ రామస్వామి ప్రకటించారు. 'ట్రంప్‌ను అనుమతించకపోతే కొలరాడో ప్రైమరీ బ్యాలెట్ నుంచి వైదొలుగుతా. అధ్యక్ష రేసులో ఉన్న రిపబ్లికన్ నేతలు రాన్ డిశాంటిస్, క్రిస్ క్రిస్టీ, నిక్కీ హేలీ కూడా ఇదే చేయాలి. లేదంటే చట్టవిరుద్ధమైన నిర్ణయాన్ని సమర్థించినట్లు అవుతుంది. ఇటువంటి తీర్పులతో తీవ్ర పరిణామాలను దేశం ఎదుర్కోవాల్సి వస్తుంది' అని రామస్వామి అన్నారు.

మన బంధం మరింత పటిష్ఠం

రష్యా ప్రధానితో భేటీలో జిన్‌పింగ్

బీజింగ్: తమ దేశాల మధ్య వ్యూహాత్మక సహకారాన్ని మరింత పెంచుకోవాలని చైనా, రష్యా సంకల్పించాయి. రష్యన్ ఫెడరేషన్ ప్రధానమంత్రి మైఖెల్ మిషుట్సిన్ చైనా పర్యటనలో ఉన్నారు. ఈ క్రమంలో ఆయన బుధవారం బీజింగ్‌లో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భేటీ అయ్యారు. ఈ ఏడాది ఆరంభంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో తాను రెండుసార్లు భేటీ అయినట్లు జిన్‌పింగ్ తెలిపారు. రెండు దేశాల ప్రభుత్వాలు, శాసనసంఘాలు, రాజకీయ పార్టీలు, స్థానిక వర్గాల మధ్య లోతైన అనుబంధం, పరస్పర అవగాహన, వివిధ క్షేత్రాల్లో పటిష్ఠ సహకారం ఉందని, ఇది క్రమంగా మరింత బలోపేతమైందని చెప్పారు. ఈ ఏడాది చైనా, రష్యా ద్వైపాక్షిక వాణిజ్య వార్షిక లక్ష్యం 200 బిలియన్ అమెరికన్ డాలర్లను సాధించినట్లు జిన్‌పింగ్ తెలిపారు. రెండు దేశాధినేతల మధ్య సహకారం, స్వీయసమృద్ధి వల్ల ఇది సాధ్యమైనట్లు చెప్పారు. చైనా, రష్యా సంబంధాలు అభివృద్ధి, నిర్వహణ వ్యూహాత్మక ఎంపికలపై ఆధారపడటంతో రెండు దేశాల ప్రాథమిక ప్రయోజనాలు ప్రజలకు అందుతూ వచ్చాయని జిన్‌పింగ్ అన్నారు. అభివృద్ధి పథంలో రష్యా ప్రజలకు చైనా ఎల్లప్పుడు మద్దతిస్తుందన్నారు. వచ్చే ఏడాది తమ దౌత్య బంధానికి 75 ఏళ్లు అవుతాయని గుర్తుచేశారు. దీంతో తమ మధ్య ఆర్థిక-సామాజిక అభివృద్ధి ప్రక్రియలో సానుకూలత, సమగ్రత పెరగాలని ఆకాంక్షించారు.

మోదీ సర్కారు కక్షసాధింపు

(మొదటిపేజీ తరువాయి)

ఎటువంటి ఐటమ్‌లు పెట్టవద్దని, సస్పెన్షన్ అమల్లో ఉన్న కాలంలో వారు ఇచ్చే ఏ నోటీసు స్వీకరించేది లేదని స్పష్టంచేసింది. కమిటీ ఎన్నికల్లోనూ ఓటు వేయలేయడానికి వీలులేదని, సస్పెన్షన్ సమయంలో రోజువారీ భత్యం కూడా పొందలేరని లోక్‌సభ సెక్రటేరియట్ జారీచేసిన సర్క్యులర్‌లో వివరించింది. పార్లమెంటు ఉభయ సభల నుంచి ఇప్పటివరకు 141 మంది ఎంపీలు సస్పెన్షన్‌కు గురికాగా... అందులో లోక్‌సభ నుంచి 95 మంది, రాజ్యసభ నుంచి 46 మంది ఉన్నారు. పార్లమెంటు చరిత్రలో మునుపెన్నడూ లేనివిధంగా ఈ స్థాయిలో ఎంపీలపై చర్యలు తీసుకోవడంపై విపక్ష పార్టీలు మండిపడుతున్నాయి. ఇందుకు నిరసనగా దేశవ్యాప్తంగా డిసెంబర్ 22 నుంచి నిరసనలు చేపట్టాలని నిర్ణయించినట్లు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. తాజాగా జరిగిన విపక్షాల కూటమి 'ఇండియా' భేటీలోనూ ఎంపీల సస్పెన్షన్ విషయాన్ని చర్చించామని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు భాగస్వామ్య పార్టీలన్నీ కలిసికట్టుగా పోరాడతాయన్నారు.

కేంద్ర సాహిత్య పురస్కారం

(మొదటిపేజీ తరువాయి)

రబీంద్ర భవన్‌లో సాహిత్య అకాడమీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ అవార్డులు ప్రకటించారు. తల్లావఝల పతంజలిశాస్త్రి 1945లో పిఠాపురంలో జన్మించారు. రామేశ్వరం కాకులు నుంచీ రోహిణీ కథ వరకూ అనేక కథలను 'రామేశ్వరం కాకులు... మరికొన్ని కథలు' పేరిట పుస్తకంగా ముద్రించారు. ఒంగోలు కళాశాలలో విద్యనభ్యసించిన తల్లావఝల ... ఆ తర్వాత తిరుపతి, పూనెలో చదివారు. పూపెలోని ప్రతిష్ఠాత్మక దక్కన్ కళాశాల నుంచి పురావస్తు శాస్త్రంలో డాక్టరేట్ అందుకున్నారు. అధ్యాపకుడిగా, ప్రిన్సిపల్‌గా పనిచేసిన పతంజలి శాస్త్రి... రాజమండ్రిలో పర్యావరణ కేంద్రాన్ని నిర్వహించారు. వడ్ల చిలుకలు, పతంజలి శాస్త్రి కథలు, నలుపెరుపు వంటి కథా సంపుటాలు ఆయన రచనల్లో మరికొన్ని ఉన్నాయి. వచ్చే ఏడాది మార్చి 12న సాహిత్య అకాడమీ వ్యవస్థాపక దినోత్సవం నాడు దిల్లీలోని అకాడమీ ప్రాంగణంలో ఈ పురస్కారం అందజేయనున్నట్లు అకాడమీ కార్యదర్శి డాక్టర్ కె.శ్రీనివాసరావు తెలిపారు.

3,858 పంచాయతీల్లో కంప్యూటర్లు లేవు

(మొదటిపేజీ తరువాయి)

వరకు అమలు చేయడానికి ఆమోదించినట్లు చెప్పారు. పంచాయతీలు రాష్ట్ర పరిధిలోని అంశమని, పంచాయతీల్లో మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత ఆయా రాష్ట్రాలదే అయినప్పటికీ ఈ పథకంలో భాగంగా పంచాయతీల పని తీరును ప్రోత్సహించే లక్ష్యంతో రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలు తమ వార్షిక కార్యాచరణ ప్రణాళికలో ప్రతిపాదించిన విధంగా కేంద్ర సాధికార కమిటీ పరిమితస్థాయిలో ఆమోదించిన మేరకు పంచాయతీలకు మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. దేశంలో ఈశాన్య రాష్ట్రాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ఆంధ్రప్రదేశ్ సహా వివిధ రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాలు, వాటి పరిధిలోని పంచాయతీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చేస్తున్న ప్రయత్నాలకు తమ మంత్రిత్వ శాఖ ద్వారా సహకారం అందిస్తున్నామని మంత్రి తెలిపారు.

న్యాయ చట్టాలకు లోక్‌సభ ఆమోదం

న్యూదిల్లీ: వలసవాద కాలం నాటి క్రిమినల్ చట్టాల స్థానంలో మూడు కొత్త చట్టాలు అమల్లోకి రానున్నాయి. కొత్త క్రిమినల్ కోడ్ బిల్లులను లోక్‌సభ బుధవారం ఆమోదించింది. దీంతో భారత శిక్షాస్మృతి (ఐపీసీ), క్రిమినల్ ప్రొసీజరల్ కోడ్ (సీఆర్‌పీసీ), ఆధారాల చట్టం (ఎవిడెన్స్ యాక్ట్) రద్దు అయ్యాయి. వాటి స్థానంలో భారతీయ న్యాయ సంహిత (బీఎన్‌ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, (బీఎన్‌ఎస్‌ఎస్), భారతీయ సాక్ష్య చట్టం (బీఎస్‌ఏ) వచ్చాయి. దాదాపు వంద మంది ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేసి లోక్‌సభలో ీలక బిల్లులను ఆమోదించారు.

ఆగని సస్పెన్షన్ల పర్వం

న్యూదిల్లీ: పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో సభ్యుల సస్పెన్షన్ల పర్వం కొనసాగుతోంది. లోక్‌సభలో ప్లకార్డులు ప్రదర్శించినందుకుగాను బుధవారం మరో ఇద్దరు ప్రతిపక్ష సభ్యులపై వేటు పడింది.కేరళ కాంగ్రెస్(మణి), సీపీఎం నుంచి ఒక్కొక్క సభ్యుడిపై స్పీకర్ సస్పెన్షన్ వేటు వేశారు. సభలో ప్రవర్తన సరిగా లేదని ఆరోపిస్తూ పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి తీర్మానం చేయగా మూజువాణి ఓటుతో స్పీకర్ ఓం బిర్లా సస్పెండ్ చేశారు. సస్పెండైన వారిలో థామస్ చళికదన్, ఏఎం ఆరిఫ్ ఉన్నారు. దీంతో లోక్‌సభలో సస్పెండైన సభ్యుల సంఖ్య 97కు చేరుకుంది. ఉభయసభల్లో కలిపి మొత్తం 143 మంది సస్పెన్షన్‌కు గురయ్యారు. వీరిలో 97 మంది లోక్‌సభ సభ్యులు, 46 మంది రాజ్యసభ సభ్యులున్నారు. ఈ చర్యలతో ప్రస్తుత సమావేశాల్లో లోక్‌సభలో విపక్షాల సంఖ్య భారీగా తగ్గిపోయింది. ముఖ్యంగా విపక్షాల కూటమి ఇండియా మూడింట రెండొంతుల బలం తగ్గినట్లయింది. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సహా కేవలం తొమ్మిది మంది మాత్రమే కాంగ్రెస్ ఎంపీలు లోక్‌సభలో మిగిలిపోయారు. భారత పార్లమెంటు చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా భారీ సంఖ్యలో ఎంపీలపై సస్పెన్షన్ వేటు పడటం ఇదే తొలిసారి. సభా కార్యకలాపాలకు ఆటంకం కలిగిస్తున్నారనే సాకుతో శీతాకాల సమావేశాలు ముగిసే వరకు కొంతమంది విపక్ష సభ్యులపై సస్పెన్షన్ విధిస్తున్నట్లు లోక్‌సభ స్పీకర్ వెల్లడించారు. ఈ క్రమంలో డిసెంబర్ 14న 13 మంది, 18న 33 మంది, 19న మరో 45 మంది, 20న మరో ఇద్దరిపై వేటు వేశారు. దీంతో మొత్తంగా సస్పెన్షన్‌కు గురైన లోక్‌సభ సభ్యుల సంఖ్య 97కు చేరింది. అటు రాజ్యసభలోనూ ఒక్కరోజే 45 మందిపై చర్యలు తీసుకున్నారు. ఇండియా కూటమికి లోక్‌సభలో 138 సభ్యుల బలం ఉంది. ప్రస్తుతం ఆ సంఖ్య 41కి తగ్గిపోయింది. తృణమూల్ కాంగ్రెస్‌కు 22 మంది ఎంపీలు ఉండగా... అందులో 13 మంది సస్పెన్షన్‌కు గురయ్యారు. డీఎంకేకు 24 మంది ఉండగా, 16 మంది సభ్యులపై వేటు పడింది. ఆమ్‌ఆద్మీ పార్టీ తరపున ప్రాతినిధ్యం వహిస్తోన్న ఒకే ఒక్క ఎంపీ సుశీల్ కుమార్ రింకూ కూడా సస్పెన్షన్‌కు గురయ్యారు. ఎన్‌సీపీకి నలుగురు ఎంపీలు ఉండగా.. అందులో శరద్ పవార్ వర్గానికి చెందిన సుప్రియా సూలే సహా ముగ్గురిపై వేటు పడింది. ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్(ఐయూఎంఎల్)కు చెందిన ముగ్గురు, వీసీకే, ఆర్‌ఎస్‌పీకి చెందిన ఒక్కో ఎంపీ, సమాజ్‌వాదీ పార్టీకి చెందిన ఇద్దరు (మొత్తం ముగ్గురు), సీపీఎం నుంచి ఇద్దరు (మొత్తం ముగ్గురు సభ్యులు), సీపీఐకి ఇద్దరు సభ్యులుండగా అందులో ఒకరిపై వేటు పడింది. బీఎస్పీకి చెందిన డానిష్ ఆలీ ఇటీవల సస్పెన్షన్‌కు గురయ్యారు. అయితే, బీఎస్పీ మాత్రం ఇండియా కూటమిలో లేదు. మరోవైపు ఇండియా కూటమిలో ఉన్న శివసేన (యూబీటీ)కు ఆరుగురు ఎంపీలుండగా... ఇందులో ఎవరినీ సస్పెండ్ చేయలేదు. ఇక రాజ్యసభలోనూ సభ్యులపై చర్యలు కొనసాగుతున్నాయి. డిసెంబర్ 14న ఒకరిపై వేటు పడగా... 18వ తేదీన ఒకేసారి 45 మందిపై సస్పెన్షన్ విధిస్తున్నట్లు ఛైర్మన్ ధన్కర్ ప్రకటించారు. 45 మందిలో 34 మందిపై శీతాకాల సమావేశాల వరకు ఈ చర్యలుంటాయని పేర్కొనగా... మరో 11 మంది 'ప్రవర్తన'పై ప్రివిలేజెస్ కమిటీకి సిఫార్సు చేశారు. ఆ నివేదికను మూడు నెలల్లో అందజేయాలని సూచించారు. అప్పటివరకు వీరిపై సస్పెన్షన్ అమల్లో ఉంటుంది. వీరిలో సగం మంది ఇండియా కూటమికి చెందిన వారే. లోక్‌సభ మొత్తం సభ్యుల సంఖ్య 543కాగా ప్రస్తుతం 522 మంది ఎంపీలున్నారు. మరో 21 స్థానాలు ఖాళీగా ఉన్నాయి. మొత్తం సభ్యుల్లో 290 మంది బీజేపీ సభ్యులే. బీజేపీ మిత్రపక్షాలు కలిపి ఈ సంఖ్య 300 దాటింది. మరోవైపు వేటు పడిన విపక్ష సభ్యుల సంఖ్య 95గా ఉంది. దీంతో దాదాపు 100 మందికిపైగా మాత్రమే ప్రతిపక్ష ఎంపీలు సభలో కొనసాగుతున్నారు. పార్లమెంటు శీతాకాల సమావేశాలు ఈ నెల 22తో ముగియనున్నాయి.

తక్షణమే ఉపాధి పనులు

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ అతివృష్టి, అనావృష్టితో సంబంధం లేకుండా వలసల నివారణకు ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాల్సిన ప్రభుత్వం... నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దుర్మార్గమని విమర్శించారు. ఉపాధి హామీ చట్టం వల్ల ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో వలసలు ఆగుతాయని ఆశించామని, ఆ ప్రాంతాల్లో వలసలు కొనసాగుతున్నాయంటే ఈ చట్టం సక్రమంగా అమలు కావడం లేదని అర్థమవుతోందన్నారు. అధికారులు, ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోకపోవడమే ఇందుకు కారణమని మండిపడ్డారు. స్థానికంగా ఉపాధి అవకాశాలు లేక పిల్లాపాపలతో స్వస్థలాలు వదిలి ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారంటే...ఇంతకన్నా దౌర్భాగ్య పరిస్థితి మరొకటి లేదన్నారు. వ్యవసాయం చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదన్నారు. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వాలు పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు.

ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు ప్రారంభం కానందున ఇప్పటికే చాలా గ్రామాల్లో వలసలు పెరిగాయని, పనులు లేక వ్యవసాయ కూలీలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణమని విమర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో వలసలు అరికట్టాలని, కరువు సహాయక చర్యలు చేపట్టి వ్యవసాయ కార్మికులను, పేదలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న గ్రామీణ ఉపాధి హామీ పథకానికి మోదీ ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని జల్లి విల్సన్ మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం విధిస్తున్న నిబంధనలు ఉపాధి హామీ కూలీలకు గుదిబండగా తయారయ్యాయన్నారు. ఉపాధి హామీ కూలీలకు నష్టం చేకూర్చే ఎన్‌ఐసీ సాఫ్ట్‌వేర్ తొలగించి...పాత సాఫ్ట్‌వేర్ కొనసాగించాలన్నారు. జాబుకార్డుతో నిమిత్తం లేకుండా 200 రోజులు పని దినాలు కల్పించాలని, కొలతలతో నిమిత్తం లేకుండా నిర్దిష్ట పనిగంటలు కేటాయించి రోజుకు 600 రూపాయల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టానికి కేంద్ర బడ్జెట్‌లో 2.40 లక్షల కోట్ల రూపాయలు కేటాయించాలని, జాబుకార్డు గల ప్రతికూలీకి 200 పని దినాలు కల్పించాలని, రోజు వేతనం 600 రూపాయలు ఇవ్వాలని, రెండు పూటలా పనివిధానం తీసివేయాలని, వేసవి భృతి పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నిర్దిష్ట సమయంలో పని కల్పించకపోతే నిరుద్యోగ భృతి కచ్చితంగా ఇవ్వాలని, పనిప్రదేశాలలో మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రావు, కౌలు రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుట్టి రాయప్ప, చేతివృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి రామాంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బండి వెంకటేశ్వరరావు, బి.కేశవరెడ్డి, సీహెచ్ ప్రభాకర్, సి.సుబ్రమణ్యం, చిలుకూరు వెంకటేశ్వరరావు, కాబోతు ఈశ్వరరావు, లండ వెంకటరావు, టి.కిష్టప్ప, తాటిపాక మధు, ఆర్.విజయ, రామానాయుడు, కలిశెట్టి వెంకటరావు, నాగుల్‌మీరా, కె.రాధాకృష్ణ, యం.నబీరసూల్, బేబీ శ్రీధర్, ఉప్పెన నరసింహారావు, వసంతరావు, సత్యబాబు, బానోతు పెద్దనాయక్, సీహెచ్.దుర్గా కోటేశ్వరరావు, విజయభారతి, కె.వీరాస్వామి, టి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం గొంతు నొక్కారు

న్యూదిల్లీ: మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ విరుచుకుపడింది. ప్రజాస్వామ్యాన్ని ఖాతరు చేయడం లేదని, నైతికతకు తావే కనిపించడం లేదని మండిపడింది. మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఊపిరాడకుండా చేస్తోందని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ నిశితంగా విమర్శించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా పార్లమెంటు నుంచి ఇంతపెద్దమొత్తంలో ప్రతిపక్ష సభ్యులను సస్పెండ్ చేయలేదని సోనియా అన్నారు. సహేతుకమైన, చట్టబద్ధమైన డిమాండ్‌ను లేవనెత్తినందుకు ఎంపీలపై వేటు వేశారని దుయ్యబట్టారు. పార్లమెంటులో సభ్యుల సస్పెన్షన్లను ఉద్దేశించి బుధవారం సోనియా ఈ వ్యాఖ్యలు చేశారు. పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో జరిగిన కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో సోనియా మాట్లాడారు. పార్లమెంటులో సోమవారం రికార్డు స్థాయిలో 78 మంది లోక్‌సభ సభ్యులు సస్పెండ్ కాగా మంగళవారం 49 మంది, బుధవారం మరో ఇద్దరిపై వేటువేశారు. గురువారం నుంచి ఇప్పటి వరకు మొత్తం 143 మంది సస్పెండయ్యారు. డిసెంబర్ 13న పార్లమెంటులో జరిగిన అలజడి సంఘటన క్షమించరానిదని సోనియా గాంధీ అన్నారు. దీన్ని ఎవరూ సమర్థించలేరని తెలిపారు. అయితే, దీనిపై స్పందించడానికి ప్రధానమంత్రి మోదీకి నాలుగు రోజుల సమయం పట్టిందని విమర్శించారు. అది కూడా ఇంత గంభీరమైన విషయంపై ఆయన తన అభిప్రాయాలను పార్లమెంటు వెలుపల వ్యక్తం చేశారని మండిపడ్డారు. ఇది సభను అపహాస్యం చేయడమేనని విరుచుకుపడ్డారు. దేశ ప్రజల పట్ల ఆయన నిర్లక్ష్యపూరిత వైఖరికి ఇది నిదర్శమని వ్యాఖ్యానించారు. జమ్మూకశ్మీర్‌కు సంబంధించి కొన్ని కీలక బిల్లులకు ఈ సమావేశాల్లో ఆమోదం లభించినట్లు సోనియాగాంధీ గుర్తుచేశారు. జవహర్‌లాల్ నెహ్రూ వంటి దేశభక్తులను కించపరిచేందుకు కొంతమంది చరిత్రను వక్రీకరించి, చారిత్రక వాస్తవాలు కప్పిపెడుతూ నిరంతరం దుష్ప్రచారం కొనసాగిస్తున్నారని సోనియా ఆరోపించారు. ఇలాంటి యత్నాల్లో ప్రధానమంత్రి, హోంమంత్రి స్వయంగా ముందుంటున్నారన్నారు. తాము ఇలాంటి చర్యలకు బెదరబోమని, నిజం చెప్పేందుకు నిరంతర పట్టుదలతో కృషి చేస్తామన్నారు. మరోవైపు ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓటమి నిరాశ కలిగించిందని చెప్పేసి ఊరుకోవడం సరికాదని సోనియా అన్నారు. ఇప్పటికే పార్టీ పేలవ ప్రదర్శనపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఓ దశ సమీక్ష నిర్వహించారని తెలిపారు. ఓటమికి గల కారణాలేమిటో విశ్లేషించారని వెల్లడించారు. తాము అనేక కఠిన సవాళ్లను ఎదుర్కొంటున్నామన్నారు. అయినప్పటికీ ఆత్మవిశ్వాసంతో వాటన్నింటినీ అధిగమిస్తూ ముందుకెళ్తామని ధీమా వ్యక్తం చేశారు. దేశంలో 'ఏకపార్టీ పాలన' నెలకొల్పాలని ప్రధాని మోదీ, బీజేపీ భావిస్తున్నట్లు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. అందుకే పార్లమెంటు నుంచి ఎంపీలను సస్పెండ్ చేశారని ఆరోపించారు. పార్లమెంటులో భద్రతా ఉల్లంఘనపై హోం మంత్రి నుంచి ప్రకటన కోరినందుకు 143 మంది సభ్యులను సస్పెండ్ చేశారన్నారు. మరోవైపు నిందితులు సభలోకి చొరబడటానికి కారణమైన బీజేపీ ఎంపీని ఇప్పటి వరకు ప్రశ్నించలేదన్నారు. పటిష్ఠ భద్రత ఉన్నా... దుండగులు లోపలికి ఎలా ప్రవేశించగలిగారని ఖర్గే నిలదీశారు.

పేదల తలరాతలు మార్చే 'విదేశీ విద్యాదీవెన'

జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం కింద రూ.42.60 కోట్లు జమ చేసిన సీఎం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పేద విద్యార్థులకు సైతం విదేశాల్లోని టాప్ యూనివర్సిటీల్లో ఉన్నత విద్య అభ్యసించే అవకాశం కల్పిస్తూ వారి తలరాత మార్చేందుకే జగనన్న విదేశీ విద్యాదీవెన పథకాన్ని అమలు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చెప్పారు. విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసిస్తున్న అర్హులైన 390 మంది విద్యార్థులకు రూ.41.60 కోట్లను, సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన 95 మంది, వారిలో తిరిగి మెయిన్స్‌లో ఉత్తీర్ణత సాధించిన 11 మంది అభ్యర్థులకు ప్రోత్సాహకంగా రూ.100.50 లక్షలను మొత్తం రూ.42.60 కోట్లను బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మీటనొక్కి వారి ఖాతాల్లో సీఎం జగన్ నిధులు జమ చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ కష్టపడి చదువుకునే వారికి పేదరికం అడ్డుకాకూడదని, ఆ కుటుంబం అప్పులపాలు కాకుండా జగనన్న తోడుగా ఉంటాడనే భరోసా నింపేందుకే విదేశీ విద్యాదీవెన అమలు చేస్తున్నామన్నారు. సంతృప్తస్థాయిలో పారదర్శకంగా ఎవరికైనా టైమ్స్ రేటింగ్స్‌లో కానీ, టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ర్యాంకింగ్స్‌లో కానీ, క్యూఎస్ ర్యాంకింగ్స్‌లో కానీ టాప్-50 కాలేజీలకు సంబంధించి 21 ఫ్యాకల్టీలలో ఉన్న దాదాపు 350 కాలేజీలలో ఆంధ్రప్రదేశ్ నుంచి ఎవరికి సీటు వచ్చినా మొత్తం ఫీజు... ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పేద వర్గాల పిల్లలకు రూ.1.25 కోట్ల వరకు మొత్తం ఫీజు అందిస్తున్నామన్నారు. ఈ పథకం గొప్ప సంతృప్తినిచ్చే కార్యక్రమమన్నారు. కారణం మిమ్మల్ని చూసి మిగిలిన వాళ్లు కూడా స్ఫూర్తి పొంది.. ఇదే మాదిరిగా టాప్ కాలేజీల్లో సీట్లు తెచ్చికుని... మీ తలరాతలు మార్చుకోవడమే కాకుండా... మీరు బాగా ఎదిగిన తర్వాత మీకు రాష్ట్ర ప్రభుత్వం తరపున అందిన సహాయాన్ని గుర్తుంచుకొని ఇతరులకు సహాయపడాలన్నారు. అలాగే మీరు మంచి సీఈఓలుగా పెద్ద, పెద్ద సంస్థల్లో పేరు సంపాదించుకున్న తర్వాత రాష్ట్రాన్ని కూడా గుర్తుపెట్టుకోవాలన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ కావాలని కలలుకనే వారికి ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందన్నారు. ఎవరైనా ప్రిలిమ్స్ పాసైనవారికి లక్ష రూపాయలు ఇచ్చేట్టుగా, ప్రిలిమ్స్ నుంచి మెయిన్స్‌కు వెళితే మరో రూ.50 వేలు... మొత్తం రూ.1.50 లక్షలు వచ్చేట్టుగా ఏర్పాటు చేశామని, ఎన్నిసార్లు వాళ్లు రాసినా ఈ మద్దతు కొనసాగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా ఇప్పటికే 95 మంది తమ్ముళ్లు ప్రిలిమ్స్ పూర్తి చేశారని తెలిపారు. అర్హత మాత్రమే ప్రామాణికంగా ఈ పథకం కింద ఎంపిక చేస్తున్నామన్నారు. సిఫార్సులు, రాజకీయ జోక్యం, అవినీతి, లంచాలు లేవని సీఎం స్పష్టం చేశారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖమంత్రి మేరుగు నాగార్జున, సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి, సాంఘిక సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి, మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శి ఏఎండీఇంతియాజ్, సాంఘిక సంక్షేమశాఖ డైరెక్ట్ విజయకృష్ణన్, ఆంధ్రప్రదేశ్ ఉన్నతవిద్యామండలి చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వైసీపీ ఓటమి ఖాయం

(మొదటిపేజీ తరువాయి)

చెప్పామన్నారు. అమరావతిని నిర్వీర్యం చేశారన్నారు.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం..

త్వరలో అమరావతి, తిరుపతిలో సభలు నిర్వహించి... టీడీపీ, జనసేన ఉమ్మడి ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేస్తామని చంద్రబాబు ప్రకటించారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలని నిర్ణయించాం. నిరుద్యోగులకు నెలకు రూ.3వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తాం. 20 లక్షల మందికి ఉపాధి కల్పన బాధ్యత తీసుకుంటా. అన్నదాత కార్యక్రమం ద్వారా ప్రతి రైతుకు ఆర్థిక సాయం చేస్తాం. అగ్రవర్ణాల పేదలను ఆర్థికంగా ఆదుకుంటాం. బీసీల రక్షణ కోసం చట్టం తీసుకొస్తాం. భవిష్యత్‌లో ఏయే కార్యక్రమాలు చేయాలనేదానిపై అధ్యయనం చేస్తాం. ఎన్నికల కురుక్షేత్ర యుద్ధంలో వైకాపా ఓడిపోవడం ఖాయం. టీడీపీ-జనసేన పొత్తు ప్రకటించినప్పుడే వైసీపీ పని అయిపోయిందని... ఇది చారిత్రక అవసరమన్నారు. మహిళలకు రక్షణ ఉండాలంటే ఏపీ... వైసీపీ విముక్త రాష్ట్రంగా మారాలన్నారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేనకు ఓటు వేస్తారనుకుంటే వారి పేర్లు జాబితా నుంచి తొలగిస్తున్నారని ఆరోపించారు. ఓటరు జాబితాలో పేరు ఉందో లేదో చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. మీరు ఒక త్యాగం చేస్తే... మేం వంద త్యాగాలు చేసి రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తును ఇస్తాం. అభివృద్ధి చేయడానికి ముందుకొస్తాం. ఉద్యోగులకు న్యాయం చేసే బాధ్యత తీసుకుంటామని చంద్రబాబు స్పష్టం చేశారు.

యువగళం ప్రజల కష్టాలు తెలుసుకున్న పాదయాత్ర: పవన్

.జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర ప్రజల కష్టాలను తెలుసుకున్న పాదయాత్ర గా అభివర్ణించారు. కష్టాలు తనకు అనుభవమేననీ,చంద్రబాబు నాయుడు రాజమండ్రి జైల్ లో ఉన్న సందర్భంలో వారి కుటుంబ సభ్యుల బాధను తాను అర్థం చేసుకున్నానన్నారు. రాజధాని లేకుండా, సరైన పంపకాలు లేకుండా రాష్ట్ర విభజన జరిగిందన్నారు. విభజనానంతరం టీడీపీకి మద్దతు తెలపడం జరిగిందన్నారు. 2019లో కమ్యూనికేషన్ గ్యాప్ వల్ల కలవలేకపోయామని... దానిని జగన్ అనుకూలంగా మార్చుకున్నారన్నారు. 2024లో జగన్ ఇంటికి పంపుతామన్నారు. జగన్ నుంచి ప్రత్యర్థులపై కేసులపెట్టడం వంటి పరిణామాలను ఊహించలేదన్నారు. ఇన్ని దశాబ్దాల రాష్ట్ర చరిత్రలో నీచంగా తిట్టించడం, కేసులు పెట్టడం వంటివి జగన్ ప్రభుత్వం రాకముందు లేవన్నారు. ఎంతోమంది కన్నీళ్లు పెట్టుకున్నారన్నారు. సొంత తల్లి చెల్లికి విలువ ఇవ్వని వారు ఇతర మహిళల పట్ల ఎలా మర్యాద గా వ్యవహరిస్తారని ప్రశ్నించారు. ఒంటరి మహిళల అదృశ్యంపై, అన్యాయాలపై మాట్లాడితే విమర్శలకు తెగబడ్డారన్నారు. లోకేశ్ మాట్లాడుతూ... తాను 3132 కిమీ పాదయాత్ర చేశానని, తన పాదయాత్ర కు అడుగడుగునా అనేక అడ్డంకులు సృష్టించారన్నారు. జరగబోయేది జగన్ అధికారానికి ఆంధ్రుల ఆత్మ గౌరవానికి మధ్య యుద్ధమన్నారు. అడుదాం ఆంధ్ర పేరుతో కొత్త పథకం తెస్తే... ప్రజలు మాకొద్దు బాబోయ్ ంటున్నారన్నారు. యువగళం పాదయాత్ర ఎన్నో పాఠాలు నేర్పిందన్నారు. ఒక నాయకుడు చేసిన తప్పులకు రాష్ట్రమంతా నష్టపోతోందన్నారు.

ఈ సభలో నాదెండ్ల మనోహర్, బాలకృష్ణ, వర్ల రామయ్య, ప్రతిభాభారతి, ఎంఎస్ రాజు, జనసేన నాయకుడు బొమ్మిడి నాయకర్, ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, పితాని సత్యనారాయణ, ఎంఎస్ బేగ్ తదితరులు మాట్లాడారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెంనాయుడు, అశోక్ గజపతిరాజు, యనమల రామకృష్ణుడు, కిమిడి కళావెంకటరావు, అయ్యన్న పాత్రుడు, గంటా శ్రీనివాసరావు, నారాయణ, గుమ్మడి సంధ్యారాణి, పరిటాల శ్రీరామ్, పయ్యావుల కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

బీఈడ్ కౌన్సెలింగ్ ఎప్పుడు?

- ప్రవేశాల్లో ఎడతెగని జాప్యం
- ఐదు నెలలుగా పడిగాపులు
- 12వేల మంది భవితవ్యం ప్రశ్నార్థకం
- ఇతర రాష్ట్రాలకు అభ్యర్థులు
- ఉన్నత విద్యామండలి నిర్లక్ష్యం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: బీఎడ్ (బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్) కోర్సుల ప్రవేశాల్లో తీవ్ర జాప్యం కారణంగా అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. 2023-24 విద్యా సంవత్సరానికిగాను రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీఎడ్ కళాశాలల్లో ప్రవేశాలకుగాను ఎడ్‌సెట్-2023కి మార్చి 22వ తేదీన ప్రకటన జారీజేశారు. జూన్ 14న నిర్వహించిన ప్రవేశ పరీక్షకు దాదాపు 12వేల మంది హాజరయ్యారు. ఇందులో అర్హత పొందిన వారికి ఇంతవరకు కౌన్సెలింగ్ నిర్వహించకపోవడంతో దిక్కు తోచడం లేదు. బీఎడ్ కళాశాలల పరిస్థితిపై అధ్యయనం చేసేందుకుగాను ఉన్నత విద్యామండలి త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ బృంద సభ్యులందరూ కళాశాలలకు వెళ్లి విద్యా ప్రమాణాలు, మౌలిక సౌకర్యాలు, బోధనా సిబ్బంది పనితీరును పరిశీలించి ఉన్నత విద్యామండలికి నివేదిం చారు. ఈ నివేదిక ఇచ్చి ఐదు నెలలు గడుస్తున్నప్పటికీ, ఇంతవరకు కౌన్సెలింగ్‌కు షెడ్యూలు జారీజేయలేదు. బీఈడీ కళాశాలల్లో ఫీజులను ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్య ఫీజు రెగ్యులేటరీ మోనటరింగ్ కమిటీ నిర్ధారించింది. అయినా కౌన్సెలింగ్ ఎందుకు నిర్వహించడం లేదనేది ప్రశ్నార్థకంగా మారింది. ఈ ఆలస్యానికి కారణాలపై ఉన్నత విద్యామండలి నుంచి స్పష్టత లేదు. రాష్ట్ర వ్యాప్తంగా 523 ప్రభుత్వ, ప్రైవేట్ బీఈడీ కళాశాలలున్నాయి. ఎడ్‌సెట్‌లో అర్హత సాధించిన వారికి బీఎడ్ కళాశాలల్లో ప్రవేశాలు లభిస్తాయి. అర్హత పొందని వారంతా యాజమాన్య కోటాలో సీట్లు పొందాల్సి ఉంటుంది. అలా ప్రవేశాలు పొందిన వారికి అదనంగా ఫీజులు చెల్లించాలి. కౌన్సెలింగ్‌లో జాప్యం కారణంగా అభ్యర్థులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది.

ఆలస్యంతో అభ్యర్థులపై ప్రభావం

విద్యా సంవత్సరం సగం గడిచినప్పటికీ, ఇంతవరకు కౌన్సెలింగ్ నిర్వహించలేదు. ఉన్నత విద్యామండలి ద్వారా ఈ విద్యా సంవత్సరానికి నిర్వహించిన ఏపీ ఈఏపీసెట్, లాసెట్, ఈసెట్, యూనివర్సిటీల సెట్ల ప్రవేశ పరీక్షలకు కౌన్సెలింగ్ దాదాపు పూర్తయింది. ఆయా కోర్సుల్లో ప్రవేశాలు పొందిన వారికి తరగతులు నిర్వహిస్తున్నారు. ఎడ్‌సెట్ కౌన్సెలింగ్ జాప్యంతో అభ్యర్థులు ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోతున్నారు. అక్కడ అధిక ఫీజులతోపాటు అదనంగా హాస్టళ్లల్లో డబ్బులు చెల్లిస్తూ, అభ్యర్థులు ఆర్థికభారానికి గురవుతున్నారు. ఏటా ఆలస్యంగా ఎడ్‌సెట్ కౌన్సెలింగ్ నిర్వహించడం వల్ల కళాశాలల్లో ప్రవేశాలు పూర్తి స్థాయిలో జరగడం లేదు. చివరి దశలో చాలా సీట్లు మిగిలిపోతున్నాయి. యాజమాన్య కోటాలో ఉన్న సీట్లను భర్తీ చేయలేక పోతున్నారు. దీంతో కళాశాలల తరగతులను కొనసాగించడం యాజమాన్యాలకు భారంగా మారింది. 2023-24 విద్యా సంవత్సరం దాదాపు సగం రోజులు పూర్తయ్యాయి. రాబోయే కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన వారికి తరగతులు ఎప్పుడు నిర్వహిస్తారనేదీ ప్రశ్నార్థకంగా మారింది. వారు తరగతులకు హాజరైన రెండు, మూడు నెలల్లోనే మళ్లీ మొదటి సంవత్సర వార్షిక పరీక్షలకు సిద్ధమవ్వాలి. ఇంత తక్కువ వ్యవధిలో అభ్యర్థులు పరీక్షలకు సిద్ధమవ్వడం అసాధ్యం. దీనిని దృష్టిలో ఉంచుకుని ఎడ్‌సెట్ కౌన్సెలింగ్‌ను వేగవంతంగా నిర్వహించాలని అభ్యర్థులు కోరుతున్నారు.

బీఎడ్ కోర్సులపై నిర్లక్ష్యం

బీఎడ్ కోర్సులపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించడంలేదు. దేశ వ్యాప్తంగా బీఎడ్‌ను రెండేళ్ల కోర్సుగా విస్తరించడం, దానికి తోడు డీఎస్సీ నోటిఫికేషన్లు సక్రమంగా రాకపోవడంపై అభ్యర్థులు ఆసక్తి చూపడం లేదు. కేంద్రం నిర్దేశించిన పాఠ్యాంశాలకు అనుగుణంగా రాష్ట్రాలలో విద్యా బోధన మొక్కుబడిగానే సాగుతోంది. చాలా ప్రైవేట్ బీఎడ్ కళాశాలల్లో లెక్చరర్ల కొరత ఉంది. రెండు, మూడు కళాశాలలకు ఒకే సబ్జెక్టు లెక్చరర్లు పార్ట్‌టైమ్ విధానంలో బోధించాల్సిన పరిస్థితులున్నాయి. ప్రభుత్వం నుంచి ఆశించినంత సహకారం లేనందున బీఎడ్ కళాశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. చాలా కళాశాలల్లో బీఎడ్ కోర్సుల్లో అభ్యర్థులు కన్వీనర్ కోటాలో ప్రవేశాలు పొందినప్పటికీ, వారంతా వారానికి లేదా నెలకోసారి వచ్చి హాజరు వేసుకునేలా అనుమతులు కల్పిస్తున్నారు. తరగతులకు క్రమంగా అభ్యర్థులు వెళ్లనందున ఆయా సబ్జెక్టుల పాఠ్యాంశాలపై వారికి పట్టు రావడం లేదు. పరీక్షల సమయంలో హడావుడిగా చదువుకుని... కేవలం ఉత్తీర్ణతే లక్ష్యంగా ముందుకు పోతున్నారు. దాని ప్రభావంతో ఏపీ టెట్, డీఎస్సీ పరీక్షల్లో ప్రతిభ చూపలేకపోతున్నారు. ఉపాధ్యాయ కోర్సులు పూర్తి చేసిన వారంతా డీఎస్సీకి దరఖాస్తు చేయాలంటే తప్పనిసరిగా ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ విద్యార్హత పరీక్ష (ఏపీ టెట్)లో ఉత్తీర్ణత సాధించాల్సిన అవసరముంది. బీఎడ్ తరగతులు రెగ్యులర్‌గా నిర్వహించక పోవడంతో ఏపీ టెట్‌లో అభ్యర్థులు సత్తా చాటలేక పోతున్నారు. కళాశాలలు సరిగ్గా పనిచేయకపోవడం, వారు కూడా అరకొరగానే సబ్జెక్టుపై పట్టు సాధించడం తదితర కారణాలున్నాయి. సమాజంలో ఎంతో గౌరవప్రదమైన ఉపా ధ్యాయ వృత్తిని ఎంచుకుంటున్న అభ్యర్థులు నష్ట పోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఏపీ ఎడ్‌సెట్ కౌన్సెలింగ్‌ను సకాలంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

చంద్రబాబుపై ఇసుక కేసులో హైకోర్టు తీర్పు రిజర్వు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఉచిత ఇసుక పాలసీ కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ఏపీ హైకోర్టులో వాదనలు ముగిశాయి. గత ప్రభుత్వం అమలు చేసిన ఉచిత ఇసుక విధానం వల్ల రాష్ట్ర ఖజానాకు తీవ్ర నష్టం వాటిల్లిందనే ఆరోపణలతో చంద్రబాబుపై సీఐడీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి ముందస్తు బెయిల్ కోరుతూ చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్‌పై సీఐడీ, చంద్రబాబు తరపు న్యాయవాదుల వాదనలు ముగిశాయి. చంద్రబాబు తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా, సీఐడీ తరపున ఏజీ శ్రీరామ్ వాదనలు వినిపించారు. రెండుపక్షాల వాదనలు ముగియడంతో పిటిషన్‌పై తీర్పును ధర్మాసనం రిజర్వ్ చేసింది.

సీఎం క్యాంపు కార్యాలయం తరలింపుపై విచారణ నేటికి వాయిదా

సీఎం క్యాంప్ కార్యాలయం ముసుగులో రాజధాని కార్యాలయాల తరలింపుపై రైతులు హైకోర్టులో వేసిన పిటిషన్‌పై విచారణ గురువారానికి వాయిదా పడింది. విశాఖకు సీఎం క్యాంపు కార్యాలయం తరలింపును సవాల్ చేస్తూ రైతులు వేసిన పిటిషన్‌పై బుధవారం హైకోర్ట్‌లో విచారణ జరిగింది. ఈ పిటిషన్‌ను ముగ్గురు సభ్యుల ధర్మాసనానికి పంపుతామని హైకోర్ట్ చెప్పింది. అక్కడ ఇప్పటికే విచారణ పెండింగ్‌లో ఉందని, ఈ లోపు పిటిషన్ వేసిన రైతుల ఆందోళనను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉన్నందున... రాజధాని కార్యాలయాల తరలింపుపై స్టేటస్ కో విధిస్తామని ధర్మాసనం చెప్పింది. దీనిపై ప్రభుత్వం నుంచి సమాచారం తీసుకుంటామని ప్రభుత్వ న్యాయవాది తెలియజేయగా, తదుపరి విచారణను హైకోర్టు గురువారానికి వాయిదా వేసింది

మెప్మా ఆర్పీల వేతనాలు సవరించాలి

ఓబులేసు డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ పేదరిక నిర్మూలన మెప్మా రిసోర్స్ పర్సన్‌లకు వేతన సవరణ చేసి కనీస వేతనం అమలు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక గొల్లపూడిలోని ఏఐటీయూసీ కార్యాలయంలో రాష్ట్ర సమావేశం నీరజ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ ఓబులేసు, ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి హాజరయ్యారు. ఓబులేసు మాట్లాడుతూ పట్టణ పేదరిక నిర్మూలన కోసం నిరంతరం కష్టపడుతూ మహిళా సాధికారత పెంచుతున్న మెప్మా ఆర్పీలకు శ్రమకు తగ్గ వేతనం ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. సామాజిక భద్రత కింద పీఎఫ్, ఈఎస్ఐ లాంటి సౌకర్యాలు కల్పించాలని, కార్మిక చట్టాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ ఆర్పీలకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని, నెలసరి వేతనాలను ఆర్పీల వ్యక్తిగత బ్యాంకులో వేయాలని డిమాండ్ చేశారు. సమావేశానికి వివిధ జిల్లాల నుంచి మెప్మా ఆర్పీలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఆర్పీల సమస్యల గురించి జగన్ ప్రభుత్వం పట్టించుకోవాలని, ఆర్పీలు క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేస్తూ మహిళలకు బ్యాంకు రుణాలు ఇప్పించడంలో ఎంతో శ్రమ పడుతున్నారని వారు తెలిపారు. శ్రమకు తగ్గ వేతనం ఇవ్వాలని ప్రభుత్వానికి సేవలందిస్తున్న ఆర్పీల గురించి ప్రభుత్వం ఆలోచించాలని కోరారు. సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటసుబ్బయ్య, నాయకులు రాజ్యలక్ష్మి, విజయకుమారి, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. న్యాయ సలహాదారులుగా వెలుగూరి రాధాకృష్ణమూర్తి, గౌరవ అధ్యక్షుడిగా ఎస్.వెంకటసుబ్బయ్య, రాష్ట్ర అధ్యక్షురాలిగా వి.రాజ్యలక్ష్మి, ఉపాధ్యక్షులుగా వై.లక్ష్మి, విజయకుమారి, ప్రధాన కార్యదర్శిగా జి.నీరజ, సహాయ కార్యదర్శులుగా సాయి, దీవెన, కోశాధికారిగా పి.జయలక్ష్మి, కమిటీ సభ్యులుగా పి.రిజ్వానా, చంద్రకళ, లతా మాధవి, నీరజ, బుజ్జి, సుశీల, సుకన్య, దుర్గా శివకుమారి ఎన్నికయ్యారు.

కేంద్ర నిధులు పంచాయతీలకే జమ చేయాలి: జాస్తి వీరాంజనేయులు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : గ్రామ పంచాయితీలకు ఆర్థిక సంఘం నిధులను నేరుగా జమ చేసేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు, అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు డిమాండ్ చేశారు. ఉత్తరప్రదేశ్ లోని ఆలీగర్‌లో రెండు రోజుల అఖిలభారత పంచాయతీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ సమ్మేళనం కార్యవర్గ సమావేశాలు బుధవారం ముగిశాయి. ఈసందర్భంగా పంచాయతీల హక్కులు, స్థానిక సంస్థలకు జరుగుతున్న అన్యాయాలను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత పంచాయతీ పరిషత్(ఢిల్లీ) జాతీయ అధ్యక్షుడు అశోక్ సింగ్ జొడాన్, కేంద్ర పంచాయతి రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ మాజీ ఎక్స్పర్ట్ కమిటీ సభ్యులు ఎస్ ఎస్ విజయ్ మిశ్రా, పంచాయతీ కౌన్సిల్‌ల అధ్యక్షులు ఏకే మిశ్రా, ఉత్తరాఖండ్ ప్రెసిడెంట్ అశోక్ సింగ్ సింగార్, మధ్యప్రదేశ్ ప్రెసిడెంట్ శ్రీ కుల్దీప్ శర్మ, జమ్మూ కాశ్మీర్ ప్రెసిడెంట్ శ్రీ జుగల్ కిషోర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా డాక్టర్ జాస్తి వీరాంజనేయులును ఉత్తరప్రదేశ్ రాష్ట్ర సర్పంచులు ఘనంగా సన్మానించారు.

సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు

విశాలాంధ్ర వైద్యం-అనంతపురం: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం అనంతపురం కలెక్టరేట్ వద్ద వేలాది మంది విద్యార్థులతో ఏఐఎస్ఎఫ్ అధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాల సమస్యలపై ఏఐఎస్ఎఫ్ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా ఇక్కడ జరిగిన మహా ధర్నాకు ముఖ్య అతిథులుగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబుతో పాటు ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రమణయ్య, కుల్లాయస్వామి మాట్లాడుతూ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు విద్యార్థులకు ఏ సమస్యలు రానివ్వనని మాట ఇచ్చిన వైఎస్ జగన్... పీఎం అయ్యాక విద్యార్థి సమస్యల్ని గాలికి వదిలేశారని మండిపడ్డారు. ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులకు చెల్లించవల్సిన రూ.1.70 కోట్ల కాస్మోటిక్ చార్జీలు పెండింగ్‌లో ఉన్నాయని... వాటిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లుల్ని కూడా విడుదల చేయాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను రూ.1400 నుంచి 1800 కు పెంచాలన్నారు. కొన్ని చోట్ల ప్రభుత్వ హాస్టల్ భవనాలు కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నాయని... తక్షణమే నూతన భవనాలు ఏర్పాటు నిర్మించాలని కోరారు. హాస్టల్ భవనాల మరమ్మతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. హాస్టల్ విద్యార్థులకు దోమతెరలు ఇవ్వాలని, హాస్టల్లో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని, మెస్ బిల్లులు విడుదల చేసి విద్యార్థు లకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని డిమాండ్ చేశారు. జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలల్లో ఖాళీగా ఉన్న బోధన బోధనేతర పోస్టులు భర్తీ చేయాలన్నారు. విద్యా రంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులను సమీకరించి చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ నరసింహయాదవ్, వెంకట్ నాయక్, అంజనేయులు, వంశీ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉమా మహేష్ మంజు, వినోద్ చందు, వేణు, నవీన్ సిద్ధు, శివ విశ్వ హరుణ్, రషీద్, ఆనంద్ ఏఐఎస్ఎఫ్ నాయకులు శాంతిరాజ్ పవన్, అఖిల్, శివమణి, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం-ఆంధ్రా' విజయవంతం చేద్దాం

సీఎం వైఎస్ జగన్ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: యువతను క్రీడా రంగంలో సమున్నతంగా ప్రోత్సహిస్తూ మరింత మెరుగైన క్రీడా ప్రమాణాలను అందించేందుకు తలపెట్టిన 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా మహోత్సవాన్ని విజయవంతం చేద్దామని సీఎం జగన్ యువతకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో మనుపెన్నడూ జరగని క్రీడా సంబరాలను గ్రామ, వార్డు సచివాలయాల నుంచి రాష్ట్ర స్థాయి క్రీడా వేదిక వరకు 'ఆడుదాం ఆంధ్రా'పేరుతో నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బుధవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో సీఎం జగన్ కలెక్టర్లతో 'ఆడుదాం ఆంధ్రా' సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో క్రీడా మంత్రి ఆర్కే రోజా, మరో మంత్రి బొత్స సత్యనారాయణ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఛైర్మన్(శ్యాప్) బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, ఆంధ్రప్రదేశ్ క్రీడా కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న, స్పోర్ట్స్ అథారిటీ వీసీ, ఎండీ ధ్యానచంద్ర తదితరులు పాల్గొన్నారు. ఆడుదాం ఆంధ్రా బ్రాండ్ అంబాసిడర్లు పీవీ సింధు, జ్యోతి సురేఖ, అంబటి రాయుడు, కిదాంబి శ్రీకాంత్, సాకేత్ మైనేని, షేక్ జాఫ్రిన్, చెన్నై సూపర్ కింగ్స్, ప్రైమ్ వాలీబాల్, ప్రో-కబాడీ ప్రతినిధులు సమావేశంలో వర్చువల్‌గా పాల్గొన్నారు. సీఎం మాట్లాడుతూ, యువతలో ఆరోగ్యకర జీవనశైలిని ప్రోత్సహించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన క్రీడా మహోత్సవమే 'ఆడుదాం ఆంధ్రా'అన్నారు. దీనికోసం జాతీయ అకాడమీలు, చెన్నై సూపర్ కింగ్స్, ప్రైమ్ వాలీబాల్, ప్రో-కబాడి వంటి ఫ్రాంచైజీలతో రాష్ట్ర ప్రభుత్వం అనుసంధానమైందన్నారు. మహిళల భాగస్వామ్యానికి ప్రాధాన్యతనిస్తూ, యువతకు నాణ్యమైన క్రీడాకిట్లను పంపిణీ చేసి, పండుగలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఏటా డిసెంబర్‌లో ఆడుదాం ఆంధ్రాను నిర్వహిస్తామన్నారు. ఈ క్రీడా టోర్నమెంట్‌లలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చూడాలని, బాలికలకు క్రీడలపై ఆసక్తిని పెంపొందించేలా ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్లను సీఎం ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఇది ప్రభావవంతంగా జరిగేలా వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని సూచించారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని పెంపొందించటంలో, ప్రతి వ్యక్తి ఫిట్‌గా, చురుకుగా ఉండటంలో క్రీడల ప్రాముఖ్యతను అందరం తెలుసుకోవాలని సీఎం నొక్కి చెప్పారు. అనంతరం 'ఆడుదాం ఆంధ్రా' ఎంపిక ప్రక్రియ, విధి విధానాల్ని అధికారులు వివరించారు. ప్రతి సంస్థ నుంచి ఫ్రాంచైజీ ప్రతినిధులు నియోజకవర్గం నుంచి రాష్ట్ర స్థాయి వరకు జరిగే క్రీడలను నిశితంగా పరిశీలిస్తారని... అసాధారణ నైపుణ్యాలను ప్రదర్శించే వారిని, నిజమైన క్రీడాస్ఫూర్తి కలిగి ఉన్న వారిని ఎంపిక చేస్తారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌కి చెందిన ఆడుదాం- ఆంధ్రా బ్రాండ్ అంబాసిడర్లు, ప్రసిద్ధ బ్యాడ్మింటన్ క్రీడాకారులు శ్రీకాంత్ కిదాంబి, పీవీ సింధు కూడా అసాధారణ బ్యాడ్మింటన్ క్రీడాకారులను గుర్తించి వారిని ఎదుగుదలకు సాయం చేయనున్నారని అధికారులు వివరించారు.

భూహక్కుల యాజమాన్య చట్టం రద్దు చేయాలి

గిడుగు రుద్రరాజు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల జారీచేసిన భూమి హక్కుల యాజమాన్య చట్టం-2022 తక్షణమే రద్దు చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ.. ఈ చట్టం ద్వారా భూమి హక్కుల యాజమాన్యంలో సమూల మార్పులు సంతరించుకోవడంతోపాటు రెవెన్యూ అధికారులకు భూమిపై హక్కులను నిర్ధారించే అధికారం సంక్రమించిందన్నారు. ఇది రాజ్యాంగబద్ధ, చట్టబద్ధ భూమి హక్కులకు తీవ్రవిఘాతం కలిగిస్తుందన్నారు. ఈ చట్టం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ సూచన మేరకు తయారు చేయబడిందని వివరించారు. కోర్టుల్లో భూవివాద కేసులు 64 శాతం ఉన్నాయని... వాటిని రెవెన్యూ అధికారులకు బదలాయిస్తే... వివాదాలు సత్వరం పరిష్కారం జరుగుతాయనే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆలోచిస్తున్నాయని తెలిపారు. గతంలో ప్రాథమిక హక్కుగా వున్న ఆస్తి హక్కు 44వ రాజ్యాంగ సవరణ ద్వారా రాజ్యాంగ హక్కుగా ఆర్టికల్ 300 ఏ గా పొందుపరిచారని పేర్కొన్నారు. మనది వ్యవసాయ ఆధారిత దేశమని, అనేక మంది ప్రజలు తమ జీవనోపాధికి ప్రత్యక్షంగా, పరోక్షంగా భూమిపై ఆధారపడ్డారని వివరించారు. భూ యజమాని హక్కులను పరిరక్షించడానికి ఆస్తి బదలాయింపు, రిజిస్ట్రేషన్, ఇండియన్ స్టాంప్, ఆంధ్రప్రదేశ్ భూ కేటాయింపు, ఇనాం రద్దు, కాంట్రాక్టు, పట్టాదార్ పాసు పుస్తకం తదితర చట్టాలు ప్రజల ఆస్తి హక్కులను కాపాడుతున్నాయని తెలిపారు.

ఉచిత్ విద్యుత్ సరఫరాలో మనమే ముందున్నాం

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో -అమరావతి: వ్యవసాయా నికి ఉచిత విద్యుత్ అందించడంలో మిగిలిన రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందని రాష్ట్ర ఇంధనశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. పగటిపూట 9గంటల పాటు ఉచితంగా నాణ్యమైన విద్యుత్ ను అందిం చడం ద్వారా రైతులకు ఈ ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. వెలగపూడి సచివాలయంలో బుధవారం ఇంధనశాఖ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సీఎం వైయస్ జగన్ పాలనలో ఇంధనశాఖను బలోపేతం చేశామన్నారు. ఈ ఏడాది కృష్ణపట్నం, ఎన్టీటీపీఎస్ థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో 1600 మెగావాట్ల అదనపు విద్యుత్ ఉత్పత్తిని అందుబాటులోకి తీసుకురాగలిగామని చెప్పారు. ఇందుకోసం చిత్తశుద్ధితో పనిచేసిన జెన్కో అధికార యంత్రాం గాన్ని అభినందిస్తున్నామని, పీక్ లోడ్ అవసరాల కోసం పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్ట్ ల ద్వారా అదనపు విద్యుత్ ఉత్పత్తికి కృషి చేస్తున్నామని చెప్పారు. ఇవి వినియోగంలోకి వస్తే రాష్ట్ర అవసరాలు తీరడంతో పాటు ఇతర రాష్ట్రాలకు కూడా విద్యుత్‌ను విక్రయించే సామర్థ్యం సాధిస్తామన్నారు. వ్యవసా యానికి పగటిపూట తొమ్మిది గంటలు నాణ్యమైన విద్యుత్ ను అందించాలన్న సీఎం వైఎస్ జగన్ సంకల్పంలో భాగంగా తక్కువ ఉత్పత్తి వ్యయం అయ్యే సోలార్ విద్యుత్ పై దృష్టి సారించామని చెప్పారు. ఇందుకోసం కేంద్రప్రభుత్వ సంస్థ సెకీతో ఒప్పందం చేసుకున్నామని, మొత్తం 7200 మెగావాట్ల విద్యుత్ ను, యూనిట్ రూ.2.49 ధరతో సెకీ నుంచి కొనుగోలు చేసి రైతులకు ఉచితంగా సరఫరా చేయనున్నామని తెలిపారు. దీనివల్ల ప్రభుత్వంపై కూడా భారం తగ్గుతుందన్నారు. సీఎం ఇటీవలే 13 ట్రాన్స్‌కో సబ్ స్టేషన్లను వర్చువల్ గా ప్రారంభించారన్నారు. రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు రాకుండా ఇంధన శాఖ అన్ని చర్యలు తీసుకుంటోందని, అవసరమైన చోట్ల కొత్త సబ్ స్టేషన్లను నిర్మిస్తోందన్నారు. వచ్చే ఏడాది నుంచి పోలవరం లో ఒక యూనిట్ ద్వారా హైడల్ విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని, హైడ్రోజన్, సోలార్, విండ్ పవర్ ఉత్పత్తికి ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ఇప్పటికే వ్యవసాయేతర భూములకు ఎకరానికి ఏటా రూ.30వేలు చెల్లిస్తూ, ఆ భూముల్లో సోలార్, విండ్ విద్యుత్ ను ఉత్పత్తి చేస్తున్నామని... ఈ విస్తీర్ణాన్ని రాబోయే రోజుల్లో మరింత పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జగనన్న కాలనీలకు విద్యుద్దీకరణ, ఉచిత వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పెద్ద ఎత్తున పేదలకు గృహవసతి కల్పించేందుకు నిర్దేశించిన జగనన్న కాలనీలకు విద్యుద్దీకరణ పనులను వేగవంతం చేయాలన్నారు. మెరుగైన విద్యుత్ సరఫరా కోసం స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపైనా రైతుల్లో సానుకూలత వ్యక్తమవుతోందన్నారు. దీనిని ప్రతిపక్షాలు రాజకీయం చేయాలని చూస్తున్నా, రైతులు మాత్రం వాస్తవాలను అర్థం చేసుకుంటున్నారని తెలిపారు. క్షేత్ర స్థాయిలో విద్యుత్ సరఫరాలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించేందుకు సబ్ స్టేషన్ల స్థాయిలో ఏర్పాటు చేసిన కమిటీలతో సమావేశాలు నిర్వహించాలని కోరారు. ఈ కమిటీల్లోని సభ్యుల నుంచి వచ్చే సూచనలు, సలహాలను పరిగణలోకి తీసుకోవాలి. టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా వినియోగదారుల నుంచి వచ్చే సమస్యలపై వెంటన స్పందించి చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో జెన్కో ఎండీ, ట్రాన్స్ కో జేఎండీ కేవీఎన్ చక్రధర్ బాబు, డిస్కమ్ సీఎండీలు ఐ.పృథ్వీతేజ్, కె.సంతోష్ రావు, పద్మాజనార్థన్ రెడ్డి, ఇంధనశాఖ సంయుక్త కార్యదర్శి బీఏవీ కుమార్ రెడ్డి, ట్రాన్స్ కో , జెన్కో డైరెక్టర్లు పాల్గొన్నారు.

వైసీపీ, బీజేపీ ఎందుకు స్పందించ లేదు

శ్రీనివాసరావు సూటిప్రశ్న

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: దేశ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా 143 మంది ఎంపీలను సస్పెండ్ చేయడం సిగ్గుచేటని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. విశాఖలోని జగదాంబ జంక్షన్ సీఐటీయూ కార్యాలయంలో సీపీఎం విశాఖపట్నం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడుతో కలిసి శ్రీనివాసరావు బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్‌లో ప్రజాస్వామ్యం ఖూనీపై రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు వైసీపీ, టీడీపీ ఎంపీలు స్పందించకపోవడం దారుణమని శ్రీనివాసరావు మండిపడ్డారు. వైసీపీ పూర్తిగా బీజేపీని అంటకాగుతోందని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడుతున్నామని చెప్పుకుంటున్న టీడీపీ సైతం బీజేపీ నిరంకుశత్వాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. పార్లమెంట్‌లో మోదీ ప్రభుత్వ అప్రజాస్వామిక పోకడలపై యువగళం సభలోనైనా టీడీపీ నాయకులు గళమెత్తాలని ఆయన డిమాండ్ చేశారు. తటస్థమనే పేరుతో ఈ రెండు పార్టీలు పార్లమెంట్‌లో బీజేపీకి మద్దతిస్తున్నాయన్నారు. విశాఖ ఉక్కును కాపాడదానికి, పోలవరం నిర్వాసితులకు ప్యాకేజీ సాధించడానికి ఈ రెండు పార్టీలు కనీసం కృషిచేయాలని, రెండు రోజుల్లో ఈ రెండు పార్టీలు తమ స్పందనను రాష్ట్ర ప్రజలకు తెలియజేయాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. 22న దేశవ్యాప్తంగా ఇండియా కూటమి చేపట్టే నిరసనలకు వైసీపీ, టీడీపీ, జనసేన మద్దతివ్వాలని కోరారు. సమస్యలు పరిష్కరించి...అంగన్‌వాడీలు, విద్యాశాఖ ఉద్యోగులు సాగిస్తున్న ఆందోళనలను విరమింపచేసే బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టంచేశారు. మూసివేసిన సుగర్ ఫ్యాక్టరీలు తెరిపిస్తామన్న జగన్ హామీ గాలిలో కలిసిందని ఆరోపించారు.

సంపాదకీయం

అప్పులు.. కాకిలెక్కలు!

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక క్రమశిక్షణ పూర్తిగా గాడి తప్పింది. ఏపీ చరిత్రలోనే కనీవినీ ఎరుగనిరీతిలో రాష్ట్రంపై రుణభారం పెరిగిపోయింది. ఫలితంగా ప్రతి పౌరుడూ లక్షలాది రూపాయల తలసరి రుణభారాన్ని మోయాల్సివస్తోంది. మూడు పథకాలు, ఆరు భారాలతో వైసీపీ ప్రభుత్వం పాలన సాగిస్తోంది. ప్రతిపక్షాలు, రెండు మూడు పత్రికలు సంధించిన ప్రశ్నలకు నిజాయితీగా సమాధానం ఇచ్చే పరిస్థితి లేక, కాకిలెక్కలతో కాలం వెళ్లబుచ్చుతోంది. ఆర్‌బీఐ హెచ్చరించినా, కేంద్ర ఆర్థిక శాఖ పదేపదే అడిగినా పట్టించుకోకుండా, చిన్నమొత్తాల పొదుపు, పీఎఫ్‌లు, డిపాజిట్లు, రిజర్వునిధులు నుంచి సైతం సొమ్ములు కాజేసే దౌర్భాగ్య పరిస్థితి జగన్ సర్కారుకు దాపురించింది. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సైతం ఏపీ అప్పులపై అవాక్కయింది. 'ఇంతజరిగినా..సంతకాడ బేరమాడినట్లు' కొత్త రుణం కోసం ఎంతో తెలివిగా అవకాశాలను చేజిక్కించుకుంటున్న ప్రభుత్వ అతి ప్రతిభకు మాత్రం అభినందనలు తెలియజేయాల్సిందే. ఏపీకి మరో 0.5 శాతం రుణం పొందేందుకు కేంద్రం అనుమతినిచ్చి ఆశ్చర్యపరిచింది. అయితే ఇక్కడొక చిక్కుంది. విద్యుత్ రంగ సంస్కరణలను అమలు చేసినందుకు గాను 2021-22 ఆర్థిక సంవత్సరంలో 12 రాష్ట్రాలకు కేంద్రం ఈ తరహా రుణం ఇచ్చింది. ఈసారి ఆరు రాష్ట్రాలకు మాత్రమే అనుమతినిచ్చింది. ఇందులో ఆంధ్రప్రదేశ్ ఒకటి. కేంద్రం ప్రవేశపెట్టిన విద్యుత్ సంస్కరణలను బీజేపీయేతర పాలిత రాష్ట్రాలు చాలావరకు వ్యతిరేకించాయి. నీటిమీటర్లు నుంచి వివిధ అంశాల వరకు ఏపీలో విద్యుత్ సంస్కరణలకు జగన్ ప్రభుత్వం ఎంతోకొంత ఊతమిస్తూవచ్చింది. బహుశా మోదీ మీద ప్రభుభక్తిని చాటుకున్నందుకు కేంద్రం రూ.5,858 కోట్ల రుణాన్ని మార్కెట్ నుంచి అదనంగా పొందేందుకు అనుమతినిచ్చి ఉండవచ్చు. కాకపోతే దీనికి 15వ ఆర్థిక సంఘం సిఫార్సులు చేసినట్లుగా కేంద్ర మంత్రి చెప్పడం అనుమానాలకు తావిస్తోంది. అధికారిక అప్పులను చూపిస్తూ, అనధికార అప్పులను దాచిపెడుతూ రాష్ట్ర ప్రభుత్వం గందరగోళం సృష్టిస్తోంది. కాగ్‌ను సైతం తప్పుదారి పట్టించినట్లుగా ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఈసారి వైసీపీ అధికారంలోకి వస్తే ఒక లెక్క...లేకుంటే రానున్న కొత్త ప్రభుత్వం ఆత్మహత్య చేసుకునేలా అప్పులకుప్పగా ఆంధ్రాను మార్చడమే ఏపీ ప్రభుత్వ లక్ష్యమైతే మాత్రం అదొక లెక్క. ఈ నేపథ్యంలో ఏపీని ఈ దశగా ప్రోత్సహిస్తున్న మోదీ ప్రభుత్వ లక్ష్యమే అంతుపట్టడం లేదు. ఇప్పటికే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై ప్రమాదకర ఘంటికలు మిన్నంటాయి. రాష్ట్ర విభజన సమయానికి రాష్ట్ర ప్రభుత్వ మొత్తం అప్పు రూ.1,32,079.16 కోట్లు. 2019 మేలో తెలుగుదేశం ప్రభుత్వం దిగిపోయేనాటికి అప్పు రూ.3,31,054.87 కోట్లు. 2023 మార్చి నాటికి కేవలం నాలుగేళ్లలో వైసీపీ ప్రభుత్వం చేసిన అప్పు రూ.5,73,590.70 కోట్లు. ఇవి ఎవరో చెపుతున్న లెక్కలు కావు. స్వయంగా రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించిన గణాంకాలు. ఇందులో సాధారణ ప్రత్యక్ష అప్పులతోపాటు ప్రభుత్వ గ్యారంటీతో చేసిన అప్పు కూడా వుంది. ఇది కాకుండా, పీఎస్‌యూల నుంచి చేసిన ప్రభుత్వ గ్యారంటీ లేకుండా చేసిన అప్పులు కూడా కలుపుకుంటే, ఆ మొత్తం రూ.6,38,217.85 కోట్లకు చేరింది. సహజంగానే ప్రభుత్వాన్ని వ్యతిరేకించేవారు వుంటారు కాబట్టి, జగన్ వ్యతిరేకులు చేసిన ఆరోపణ ప్రకారం, మొత్తం అప్పులు రూ.8,45,836 కోట్లు. ప్రభుత్వ అధికారిక లెక్కలకు, ప్రతిపక్షాలు చూపిస్తున్న లెక్కలకు మధ్య పొంతన లేకపోయినప్పటికీ, తేడా మాత్రం అటుఇటుగా లక్ష కోట్లు వుంది. ప్రభుత్వం చూపిన లెక్కల్లోనైనా ఆంధ్రప్రదేశ్ రికార్డుస్థాయిలో అప్పుల్లో కూరుకుపోయినట్లేనన్నది విస్పష్టం.

వైసీపీ ప్రభుత్వం చేసిన రుణాలపై ప్రభుత్వం తరపున రోజుకో అధికారిక మీడియా ముందుకు వచ్చి ఏవేవో పత్రాలు చూపిస్తూ వుంటారు. ప్రభుత్వం చాలా నిక్కచ్చిగా వుంటుందని, రుణాలు తెచ్చుకోవడానికి అడ్డదారులంటూ ఏమీలేవని బుకాయిస్తూ వుంటారు. తాజాగా సీఎం ప్రత్యేక కార్యదర్శి కూడా ఈ తరహాలోనే గణాంకాల గారడీ ప్రదర్శిస్తున్నారు. అంకెలన్నీ నిజమైతే పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సమావేశానికి ఎందుకు సిద్ధపడటం లేదు? కేంద్ర పరిధిలో వున్న ఎఫ్ఆర్‌బీఎం చట్టాన్ని అసెంబ్లీలో సవరించిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిది. ఫిస్కల్ రెస్పాన్సిబిలిటీ అండ్ బడ్జెట్ మేనేజ్‌మెంట్ (ఎఫ్ఆర్‌బీఎం) చట్టమనేది కేంద్రానిది. ఏ రాష్ట్రం ఎంత అప్పుతీసుకోవాలి? దాని పరిమితి ఏమిటి? అన్న అంశాలు ఎఫ్ఆర్‌బీఎం పరిధిలో వుంటాయి. ఈ ఎఫ్ఆర్‌బీఎం చట్టం ప్రకారమే పరిమితి ప్రకారం అప్పులు తెచ్చుకోవాలి. దాని ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ రెవిన్యూలో 90 శాతం మేరకు గ్యారంటీ అప్పులకు పరిమితి వుంటుంది. కాకపోతే వైసీపీ ప్రభుత్వం ఈ కేంద్ర చట్టాన్ని ప్రతిపక్ష సభ్యుల సస్పెన్షన్ల నడుమ సవరించి, 180 శాతానికి పరిమితిని పెంచి, తనకు ఇష్టమొచ్చినట్లు రుణాలను తీసుకుంది. అవసరంకోసం తీసుకున్నా...ఇవి అక్రమ అప్పుల కిందకే వస్తాయన్నది జగద్విదితం. పైగా వాటిని సక్రమ రుణాలుగా చెప్పుకోవడం జగన్ సలహాదారులకే చెల్లింది. ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్‌డీసీ) విషయంలో కేంద్రం మొట్టికాయలు వేసింది. ఆంధ్రప్రదేశ్ సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ సిస్టమ్స్ అండ్ సర్వీసెస్ (ఏపీసీఎఫ్ఎస్ఎస్) విషయంలో రిజర్వ్‌బ్యాంకు మందలించింది. బెవరేజెస్ కార్పొరేషన్ విషయంలో సెబీ హెచ్చరించింది. ఇలా అప్పులు చేయడం రాజ్యాంగంలోని అధికరణ 293(3), అధికరణ 261లను ఉల్లంఘించడమే. ఇదే విషయంపై గత ఏడాది ఆగస్టులో కేంద్ర ఆర్థిక శాఖ రాష్ట్ర సీఎస్‌కు లేఖ రాసింది. రుణాలన్నీ పక్కనబెడితే, రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా 1,70,000 కోట్ల మేరకు పెండింగ్ బిల్లులను చెల్లించాల్సి వుంటుంది. ఈ లెక్కలన్నీ 2023 మార్చి వరకు మాత్రమేనన్నది గమనించాలి. ఇక అక్కడినుంచి అటు అప్పులూ, ఇటు చెల్లించాల్సిన బిల్లులూ పెరిగాయన్న వాస్తవాన్ని విస్మరించరాదు. ఏప్రిల్ 1 నుంచి ఇప్పటివరకు దాదాపు రూ.50 వేల కోట్ల బిల్లులు సీఎఫ్ఎంఎస్ వ్యవస్థలో చెల్లించాల్సి వుంటుందని రెవిన్యూ వర్గాల భోగట్టా. గత టీడీపీ ప్రభుత్వం అప్పులు చేయలేదని, అదొక గొప్ప ప్రభుత్వమని చెప్పడంలేదు. అలాగే వైసీపీ ప్రభుత్వం అద్భుతమని చెప్పడానికి అంత 'దృశ్యమేమీ' ఇక్కడలేదు. ఏ ప్రభుత్వమైనా తప్పని పరిస్థితుల్లో అప్పులు చేయడం సహజం, అనివార్యం. కాకపోతే, ఇంత ఘోరంగా రుణభారం తెచ్చిపెట్టి, ఆర్థిక క్రమశిక్షణ విషయంలో మంచి పేరున్న ఆంధ్రప్రదేశ్‌ను భ్రష్టుపట్టించిన ఘనత మాత్రం వైసీపీ ప్రభుత్వానిదే. మరో 3, 4 నెలల్లో ఎన్నికలు జరగబోతున్న తరుణంలో ఇప్పటికిప్పుడు వైసీపీ ప్రభుత్వం నడక మారిపోతుందని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పురోగతి బాటలో నడిపిస్తుందని ఆశించి, భంగపడలేం. మారాల్సింది ప్రభుత్వ నడక, నడత కాదు, ప్రభుత్వమే మారాలి.

సమస్యల పెను తుపానులో మత్స్యకారుల జీవితాలు

డాక్టర్ సీఎస్ క్షేత్రపాల్ రెడ్డి

అత్యంత పేద వర్గాలైన మత్స్యకారుల జీవనోపాధి తీవ్రంగా దెబ్బతింటోంది. సముద్రాన్నే నమ్ముకుని జీవిస్తున్న లక్షలాది మత్స్యకార కుటుంబాలు జీవనోపాధికి దూరం అవుతున్నాయి. సముద్రాలతోపాటు తీర ప్రాంతాలను సైతం బడా కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకే కేంద్ర ప్రభుత్వం కొత్తగా బ్లూ ఎకానమీ పాలసీని తెచ్చింది. సముద్ర జలాల పరిరక్షణ, పర్యావరణం, సముద్రాన్ని నమ్ముకుని జీవిస్తున్న మత్స్యకారుల రక్షణకు సంబంధించిన అంశాలేవీ లేకుండానే దేశంలోని సముద్ర తీరాన్ని, సముద్ర సంపదల్ని స్వదేశీ, విదేశీ కార్పొరేట్‌లకు అప్పగించి కార్పొరేట్ల సేవలో తరించాలని చూస్తోంది.

ప్రపంచ వాణిజ్యంలో 80శాతం సముద్రాలనుంచే జరుగుతుంది. ప్రపంచ జనాభాలో 40 శాతం మంది ప్రజలు తీరప్రాంతాలకు సమీపంలోనే నివసిస్తున్నారు. భారతదేశంలో అరేబియా, బంగాళాఖాతం వెంబడి కీలకమైన వివిధ ఓడరేవు నగరాలున్నాయి. మొత్తం 8,118 కి.మీ పొడవైన తీరప్రాంతం ఉంది. ప్రతి ఏటా దాదాపు 4.412 మెట్రిక్ టన్నుల చేపల ఉత్పత్తి జరుగుతోంది. 4 మిలియన్ల మంది ప్రజలు సముద్ర చేపల వేటపై ఆధారపడి జీవిస్తున్నారు. ఏటా రూ.65వేల కోట్ల మేర వ్యాపారం జరుగుతున్నట్టు లెక్కలు చెబుతున్నాయి. అయితే మోదీ ప్రభుత్వం మోసపూరితమైన బ్లూ ఎకానమీ పాలసీని తయారుచేసి ఇది దేశ ఆర్థికవృద్ధికి మద్దతుగా నిలుస్తుందని నమ్మబలుకుతోంది. దేశంలోని తొమ్మిది తీరప్రాంత రాష్ట్రాల్లోని 12 మేజర్ పోర్టులు, 200 చిన్న పోర్టులకు రవాణా సౌకర్యాల కల్పనద్వారా వ్యాపారాన్ని పెంచాలనేది ఇందులో ప్రధానాంశమని చెబుతున్నా షిప్పింగ్ పరిశ్రమ విస్తరణద్వారా కార్పొరేట్ శక్తులకు మరింత లాభం చేకూర్చాలని చూస్తోంది. ఇందులో భాగంగానే ఇప్పటికే దేశంలోని ప్రధాన పోర్టులన్నీ మోదీ ఆత్మీయుడైన అదానీ చేతుల్లోకి చేరిపోయాయి. మెరైన్ బయో టెక్నాలజీ, మైనింగ్‌ల పేరుతో సముద్రంలోని ఇసుక, ఇతర ఖనిజ సంపదలను కూడా కార్పొరేట్ శక్తుల గుత్తాధిపత్యం కిందకు తేవాలని పావులు కదుపుతోంది.

సముద్రతీర ప్రాంతాల్లో ఇప్పటికీ సరైన మౌలిక సదుపాయాలు లేవు. లాభాలకోసం పనిచేసే సంస్థలకు సముద్ర ప్రాంతాల్ని అప్పగించడం ద్వారా విపరీతమైన పర్యావరణనష్టం తప్పదు. సముద్రంతో ఇప్పటికే ఓవర్ ఫిషింగ్ అనేది ఒక పెద్ద సవాలుగామారి మత్స్యకారుల పాలిట శాపంగా మారుతోంది. హైసీస్‌లో అంతర్జాతీయ సంస్థలకు చేపలు పట్టుకునేందుకు అవకాశం కల్పించడంతో క్రమంగా ప్రపంచానికి ఫుడ్ బాస్కెట్‌గా పిలిచే సముద్రజలాల్లో చేపల నిల్వలు క్షీణించి సముద్ర పర్యావరణ వ్యవస్థకే పెనుముప్పు తప్పదు. సముద్రాలు వ్యాపార కేంద్రాలుగా మారడంతో ఎగుమతులు, దిగుమతుల కారణంగా, సముద్రంపై ఇంధన రవాణాతో చమురు చిందటం, ప్లాస్టిక్ వ్యర్థాలు, పారిశ్రామిక వ్యర్థాలతో కాలుష్యం పెరుగుతుంది. ఇక డీప్ సాండ్ మైనింగ్ కారణంగా సముద్ర పర్యావరణ వ్యవస్థలకు హాని కలుగుతోంది. సముద్ర వనరులను హద్దు అదుపులేకుండా వెలికితీయడం ద్వారా ప్రకృతి దెబ్బతింటుందని ప్రపంచబ్యాంకు హెచ్చరించింది. సముద్ర వనరులు వేగంగా క్షీణిస్తాయని స్పష్టం చేసింది. బ్లూ ఎకానమీ పాలసీ సముద్ర వనరుల దోపిడీకి అనుకూలంగామారి సముద్ర పరిరక్షణ అనే లక్ష్యానికి విరుద్ధంగా ఉండడంతో ఇది మత్స్యకారుల పాలిట విషాదకరమైన పాలసీ అవుతుంది.

సముద్రంలో చేపలవేట సాగించే మత్స్యకారులకు వృత్తి గిట్టుబాటుకాక లక్షలాది కుటుంబాలు వలసల వలలో చిక్కుకుంటున్నాయి. తమ జీవనానికి ప్రధాన ఆధారమైన చేపలవేటను వదలి పొట్టచేతబట్టుకుని పశ్చిమబెంగాల్, ఒడిశా, కేరళ, తమిళనాడు, కర్ణాటక, గోవా, మహారాష్ట్ర, గుజరాత్ తదితర తీరప్రాంతాలకు వలస వెళ్తున్నారు. వందలమంది తెలియక విదేశీ జలాల్లోకి ప్రవేశించి జైళ్లపాలవుతున్నారు. ఎంతో కాలంగా భారతదేశం, శ్రీలంకల మధ్య ఫిషింగ్ వివాదం కారణంగా రెండుదేశాల మత్స్యకారుల మధ్య గందరగోళానికి, సంఘర్షణకు దారితీస్తూనే ఉన్నా కేంద్రం పట్టించుకోవడం లేదు. ఏపీలో మొత్తం 970 కిలోమీటర్ల పొడవైన తీరప్రాంతం ఉంది. ఈ ప్రాంతంలోని మత్స్యకారుల జీవనం సముద్రంపైనే ఆధారపడగా పరోక్షంగా లక్షలమంది జీవిస్తున్నారు. సముద్రతీరంలో వెలసిన పరిశ్రమలు, చమురు, గ్యాస్ నిక్షేపాల ద్వారా రసాయన కాలుష్యం ఏర్పడి గత కొన్నేళ్లుగా సముద్రతీరంలో మత్స్య సంపద క్షీణించిపోతోంది. సముద్రంలోకి 30-40 కిలోమీటర్ల దూరం వెళితేగానీ చేపలు చిక్కడంలేదు. అంత దూరం వెళ్లిన సంప్రదాయ మత్స్యకారులు ప్రమాదాల్లో, ప్రకృతి వైపరీత్యాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు.

2019లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వైసీపీ అవసరమైనచోట జెట్టీలు కాదు, ఏకంగా ఫిషింగ్ హార్బర్లే నిర్మిస్తామని చెప్పిన మాటలు నీటిమూటలయ్యాయి. రూ.3,500 కోట్ల వ్యయంతో మెరైన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిర్మించి శాశ్వతంగా వలసల్ని నివారిస్తామని చేసిన వాగ్దానాలు అమలుకాలేదు. ఇంచేత ఇతర ప్రాంతాలకు చేపల వేటకోసం వలస వెళ్లినవారిలో కొందరు దారితప్పి పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక సముద్ర జలాల్లోకి ప్రవేశించి జైళ్ల పాలయ్యారు. చేపలవేటతో బతికే అవకాశం ఉన్నా, ప్రభుత్వాల నిర్లిప్తతతో వేలమంది తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గుజరాత్, కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలు కనీసం 20 నుంచి 30 కిలోమీటర్లకు ఒక జెట్టీ నిర్మించాయి. ఇదే పనిచేయడానికి ఏపీ ప్రభుత్వానికి ఎందుకు చేతకావడంలేదో అర్థం కావడంలేదు. ఎక్కడికక్కడ జెట్టీలు నిర్మిస్తేనే వ్యాపార అవకాశాలు మెరుగుపడి, దళారీల పెత్తనం తగ్గి మత్స్యకారుల జీవితాల్లో గణనీయమైన మార్పులు వస్తాయని ప్రభుత్వం గుర్తించాలి. ఏప్రిల్-జూన్‌ల మధ్య కాలంలో మత్స్యకారులు పడుతున్న వెతలు అన్నీ ఇన్నీకావు. చేపలు పిల్లలు పెట్టే సమయం కాబట్టి చేపలవేటపై నిషేధం ఉంటోంది. ఈ సమయంలో మత్స్యకారులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం మత్స్యకార భరోసా కింద కేవలం రూ.10వేల ఆర్థిక సాయం అందించి చేతులు దులుపుకుంటోంది. ఇది కూడా ఓటుబ్యాంకు రాజకీయంలో భాగమే. ప్రభుత్వం అందించే రూ.10వేలతో మత్స్యకారుల కుటుంబాలు గడవవని ప్రభుత్వానికి బాగా తెలుసు. పైగా ఈ సాయం పొందాలంటే సవాలక్ష ఆంక్షలు ఉంటున్నాయి. ఇతర ప్రభుత్వ పథకాలు పొందుతున్న వారికి ఇది వర్తించడంలేదు. మత్స్యకార గ్రామాల్లో యువతకు ఇతర ఉపాధి అవకాశాలులేవు. కనీసం రోడ్లు, తాగునీటి సదుపాయాలు కూడా అందుబాటులో ఉండడంలేదు. ఇటీవల విశాఖ హార్బర్‌లో జరిగిన అగ్ని ప్రమాదం వేలాది కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. అయినా ప్రభుత్వం సాయంపేరుతో మెతుకులువిదిల్చి నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోంది. ఇలా ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల కారణంగా మత్స్యకారుల జీవితాలు సమస్యల పెనుతుపానులో చిక్కుకుపోతున్నాయి. ఈ నేపథ్యంలో పాలకులు సముద్ర సంపదను కేవలం ఆర్థికవనరుగానే పరిగణించకూడదు. సామాజిక, సాంస్కృతిక, పర్యావరణం కోణంలోనూ చూడాల్సి ఉంటుంది. కేవలం కార్పొరేట్ల కోసం, వ్యాపార కాంక్షతో లక్షలాదిమంది మత్స్యకారుల కడుపుకొట్టేలా రూపొందించిన బ్లూ ఎకానమీ పాలసీని రద్దు చేయాలి. సముద్ర తీరప్రాంతాల్లో పర్యావరణానికి హానికలుగకుండా స్థిరమైన అభివృద్ధికోసం అన్ని రంగాల నిపుణులతో సంప్రదింపులు జరిపి సమగ్రాభివృద్ధికి కృషి చేయాల్సి ఉంటుంది.

(డిసెంబరు 23న విశాఖపట్నంలో ఏపీ మత్స్యకారసంఘం రాష్ట్ర మహాసభలు జరుగుతున్న నేపథ్యంలో)

ఫోన్: 9059837847

జగన్ ప్రభుత్వంపై వ్యతిరేకత

సుశీల్‌కుట్టి

జగన్మోహన్ రెడ్డి రాజకీయాల్లో బలమైన రెడ్డి గ్రూపు వ్యతిరేకత ఉందని భావిస్తున్నారు. తెలంగాణలో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావుపై వ్యతిరేకత బలంగా ఉన్నందున అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయారు. పదేళ్ల తర్వాత కాంగ్రెస్ గెలుపొంది ఉత్సాహంగా ఉంది. కెసిఆర్ వలె వైఎస్ఆర్ ముఖ్యమంత్రి జగన్‌పై వ్యతిరేకత ఉందని రాజకీయవర్గాలు అనుకుంటున్నాయి. రాష్ట్రంలో రాజధాని కూడా లేకపోవడంవల్ల జగన్‌పై వ్యతిరేకత పెరుగుతోంది. రాజధాని పదేళ్లు లేకపోవడానికి జగన్ కారణమని ప్రజలు కోపంతో ఉన్నారు. 2024 ఏప్రిల్-మే నెలలో లోక్‌సభకు, అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. ఈ సందర్భంగా జరిగే ఎన్నికల ప్రచారంలో రాజధాని సమస్య చర్చనీయాంశమవుతుంది. పాలక వైసీపీకి తెలుగుదేశం, జనసేనకు మధ్య పోటీ ఉంటుంది.

ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీకి ఏ మాత్రం బలంలేదు. ఎలాంటి కలలుగనే అవకాశం కూడా లేదు. ఒకవేళ కుదిరితే, వైసీపీతో కొన్ని సీట్లకోసం పొత్తు కుదరవచ్చు. 2024జూన్ నాటికి ఏ పార్టీ గెలిచినా, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడుతుంది. అలాగే లోక్‌సభ ఎన్నికల్లో ఏ పార్టీ అధిక సీట్లు గెలుచుకుందనే అంశం తేలిపోతుంది. అప్పటికీ కొత్త రాజధాని ఏర్పడవచ్చు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉండగా, అమరావతి రాజధానిగా ప్రకటించారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత విశాఖపట్నం రాజధానిగా చేస్తానని ప్రకటించారు. ప్రస్తుతం రాజధాని లేకుండా పోయింది. ఒక దశలో కర్నూలు కూడా రాజధానిగా ప్రకటించాలని భావించారు. రాజధానికి సంబంధించి జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయాలు తీసుకోవడంలో చాలా జాప్యం చేస్తున్నారు. ఏ విధంగానైనా విశాఖపట్నం రాజధానిగా అధికారిక ప్రకటన చేయాలని జగన్మోహన్‌రెడ్డి భావిస్తున్నారు. కాంగ్రెస్‌పార్టీ తెలంగాణలో గెలుపొంది ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పటికీ దాని ప్రభావం పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌మీద పెద్దగా ఉండబోదని విశ్లేషకులు భావిస్తున్నారు. గతంలో వైసీపీ, టీడీపీ కంటే కాంగ్రెస్ ఆంధ్రప్రదేశ్‌లో బలంగా ఉంది. అయితే 2014నుంచి కాంగ్రెస్ క్రమంగా బలహీనపడింది.

రాష్ట్ర విభజన తరువాత ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో కాంగ్రెస్ బలం బాగా తగ్గిపోయింది. తెలంగాణలో కేసీఆర్ నాయకత్వంలోనే బిఆర్ఎస్ ప్రభుత్వ వ్యతిరేకతను తట్టుకుని గెలవలేకపోయింది. కర్నాటకలో కాంగ్రెస్ గెలుపొందిన తర్వాత దాని ప్రభావం తెలంగాణ ప్రజలమీద గణనీయంగా పడింది. కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ జోడో యాత్ర చేసిన తర్వాత కాంగ్రెస్ గతం కంటే బలం పుంజుకుంది. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ఏమాత్రం బలం పుంజుకోలేదు. ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ఇప్పటికీ బలహీనంగానే ఉంది. బిఆర్ఎస్ తెలంగాణలో ఓటమిచెందిన విధంగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వంపట్ల వ్యతిరేకత జగన్‌మోహన్‌రెడ్డి ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు. తెలుగుదేశం, జనసేన కలిసి గట్టిపోటీ ఇవ్వగలవని భావిస్తున్నారు. 2014లో టీడీపీ గెలుపొందగా, 2019లో వైసీపీ అసెంబ్లీ ఎన్నికలలో మంచి మెజారిటీతో గెలిచి ప్రభుత్వం ఏర్పాటుచేసింది. రాష్ట్రంలో 25 లోక్‌సభ స్థానాలకుగాను వైసీపీ 22సీట్లు దక్కించుకుంది. మెజారిటీ సీట్లు గెలుచుకున్న వైసీపీ కేంద్రంలో బీజేపీకి తోడ్పాటు అందించింది. 175 అసెంబ్లీ స్థానాలకుగాను, వైసీపీ 151 స్థానాలను గెలుపొందింది. ఒక విశ్లేషణ ప్రకారం, కాంగ్రెస్ తమకున్న బలం ఏమిటో నిరూపించుకోవాలని చూస్తోంది. రాష్ట్ర విభజనకు కేంద్రంలో ఉన్న కాంగ్రెస్‌పార్టీ అంగీకరించిన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ విడిపోయింది. తెలంగాణలో కాంగ్రెస్ గెలుపొందిన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో కార్యకర్తలలో ఉత్సాహం ఏర్పడింది. ఇప్పుడు నాయకత్వం వహించిన నాయకులలో కొంతమేరకు విశ్వాసం ఏర్పడింది. ఎన్నికలలో తక్కిన పార్టీలతో సమంగా పోటీచేయడానికి తగినన్ని నిధులు లేవనేది తెలుస్తోంది. అంతేకాదు, కార్యకర్తల బలం కూడా ఇతర పార్టీలతో ఢీకొనేస్థాయి కనిపించడంలేదు. అలాగే ముమ్మరంగా ప్రచారం చేయగలిగిన అవకాశంకూడా కాంగ్రెస్‌కు తక్కువేఉంది. తెలంగాణలో రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌కు నాయకత్వం వహించి పార్టీని అధికారంలోకి తీసుకు రావడానికి ఎంతగానే కృషి చేశారు. పార్టీలో గ్రూపులున్నప్పటికీ ఒకరిపైన ఒకరు పెద్దగా గొడవపెట్టుకోకుండా ప్రచారం సాగించారు. అలాంటి పరిస్థితి ఆంధ్రప్రదేశ్‌లో లేదు.

తెలంగాణ ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌లో ప్రధాన ప్రచారకుడయ్యారు. అంధ్రప్రదేశ్‌లో జనవరి 26 ప్రాంతం నుంచి జగన్మోహన్‌రెడ్డి ముమ్మరంగా ప్రచారం సాగించి ప్రభుత్వ వ్యతిరేకతను లేకుండా చూసుకునేందుకు ప్రయత్నించనున్నారు. వైసీపీ, తెలుగుదేశం పార్టీలు రాష్ట్రంలో బలంగా ఉన్నాయి. జనసేన, టీడీపీతో కలిసి పోటీ చేస్తున్నందున ఈసారి అసెంబ్లీ ఎన్నికలలో గెలుపొంది రెండు పార్టీలు కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేయవచ్చునన్న ఆశాభావం జనంలో లేకపోలేదు. మరోవైపు కాంగ్రెస్ ఇంటింటికీ తిరిగి ప్రచారం చేయడానికి సిద్ధపడుతుందని తెలుస్తోంది. కాకినాడలో ఏఐసీసీ శతవార్షికోత్సవాలు జరగనున్నాయని తెలుస్తోంది. ప్రభుత్వ వ్యతిరేకతను తప్పించుకునేందుకు వైసీపీ ఎంఎల్ఏలు చాలామందిని పక్కనపెట్టి కొత్తవాళ్లకు పోటీచేసే అవకాశం ఇస్తారనే చెబుతున్నారు.

హిందుత్వరహిత బీజేపీ గెలుస్తుందా?

ఎమ్.ఎమ్.భౌమిక్

పలంపూర్‌లో 1989లో జరిగిన బీజేపీ సమావేశంలో హిందుత్వ భావజాలాన్ని అనుసరించాలని తీర్మానించింది. హిందూత్వ సాంస్కృతిక దేశంగా గుర్తింపు పొందడానికి ఆర్ఎస్ఎస్ గణనీయంగా తోడ్పడింది. 2014లో నరేంద్రమోదీ రాజకీయాల ఆవిర్భావంతో ఆర్థిక విధానాలు, సామాజిక సంక్షేమ పథకాలు, విదేశాంగ విధానంలో మార్పు, కార్యకర్తల ఆధారంగా బలపడిన సంస్థలు హిందూత్వ భావజాలాన్ని పూర్తిగా జీర్ణించుకున్నాయి. హిందుత్వ రాజకీయాలలో భాగంగా ఆర్ఎస్ఎస్ పూర్తిగా మునిగిపోయింది. హిందుత్వ భావజాలంతో పరస్పర సంబంధం లేకపోయినప్పటికీ అనేకమంది కలిసిపోయారు. ప్రతిపక్ష రాజకీయాలు హిందుత్వ భావజాలాన్ని తిప్పికొట్టేందుకు పూనుకున్నాయి. దేశంలో ఆనాటినుంచి రెండు విధాలైన రాజకీయ కోణాలు చోటుచేసుకున్నాయి. కఠినమైన హిందుత్వ రాజకీయాలు అలాగే ఎన్నికల సమయంలో భిన్నమైన భావజాలం నెలకొన్నది. ఇటీవల ఐదురాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరిగినప్పుడు మూడు హిందు రాష్ట్రాలలో భిన్నమైన ఫలితాలు వచ్చాయి. మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌ఘడ్‌లలో కఠినమైన హిందుత్వ భావజాలం విజయానికి దోహదం చేసింది. సంక్షేమ పథకాలు, సంస్థాగత పటిష్టత, పార్టీ కార్యకర్తలను క్షేత్రస్థాయిలో బలోపేతంచేయడం తదితర కారణాలవలన బీజేపీ విజయం సాధించింది. నరేంద్ర మోదీ లేదా బీజేపీ రాజకీయాలు నూతన కోణాన్ని అనుసరించాయి. మతం ఆధారంగా హిందుత్వ రాజకీయాలు కొంత వెనుకపట్టుపట్టాయి.

మధ్యప్రదేశ్‌లో బీజేపీ కేంద్ర నాయకత్వం శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను తిరిగి ప్రముఖస్థానంలో నిలిపేందుకు ప్రయత్నించలేదు. బీజేపీపై ఓటర్లు విసుగు చెందారన్న విషయాన్ని గ్రహించి కొత్త అభ్యర్థులను నిలపడంతోపాటు మంత్రులను, ఎంపీలను పోటీ చేయించింది. అలాగే అంతకుముందు నుంచి అమలుచేస్తున్న లార్డ్లీ బెహనా-లార్డ్లీ లక్ష్మి పథకాలపైన ఎక్కువ శ్రద్ధ వహించారు. అలాగే మైనారిటీల జోలికి వెళ్లలేదు. మతంపైన తీవ్రంగా మాట్లాడలేదు. కాంగ్రెస్ కులగణన కావాలని చెబుతుండగా, బీజేపీ అగ్రవర్ణాలను, ఓబీసీలను ఒక్కటిగా చేసింది. అదే సమయంలో కాంగ్రెస్ ఒక మాదిరిగా హిందుత్వ విధానాన్ని అనుసరించింది. అదే సమయంలో కులగణనను కూడా కలిపి ప్రచారం చేసింది. దీనితో ఓటర్లు గందరగోళపడ్డారు. హిందు, ముస్లింలపై ప్రచారాన్ని ఎక్కువగా ప్రస్తావించక పోవడంతో 230 సీట్లకుగాను, బీజేపీ 164సీట్లు గెలుపొందింది. చత్తీస్‌ఘడ్‌లో గెలుపు తమదేనని కాంగ్రెస్ పూర్తిగా విశ్వసించింది. ముఖ్యమంత్రి భూపేష్‌సింగ్ భగేల్ గెలుపుపై ఎక్కువగా నమ్మకం పెట్టుకున్నారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ వ్యతిరేకత ఉన్నదన్న అంశాన్ని గ్రహించలేదు. బీజేపీ హిందుత్వ రాజకీయాలను వినియోగించి ఓటర్లపై నమ్మకం పెట్టుకున్నది. భగేల్ ఒక విధమైన మెత్తటి హిందుత్వ రాజకీయాలను అనుసరించారు. రామ్ ఒన్ గమన్‌పాథ్ పథంతో చొరవ తీసుకుని ప్రచారం సాగించారు. రాష్ట్రంలో గణనీయంగా ఓబీసీ,ఎస్‌సీ,ఎస్‌టీలు ఉన్నప్పటికీ, కాంగ్రెస్ ప్రచారం చేసిన కులగణన విఫలమైంది. గ్యాసు సిలిండర్ రూ.500కే ఇస్తామని, భూమిలేని కూలీలకు ఏడాదికి రూ.10వేలు నగదు సహాయం చేస్తామని, వివాహమైన మహిళలకు ఏడాదికి రూ.12వేలు గ్రాంట్ ఇస్తామని ప్రచారం చేసినప్పటికీ కాంగ్రెస్ ఓటమిని చవిచూసింది. రాజకీయ విభజనతోపాటు హిందూత్వ ప్రచారం ఏ మాత్రం ఉపయోగపడలేదు.

రాజస్థాన్‌లో అనేక ప్రజోపయోగ పథకాలను ప్రవేశపెట్టి కాంగ్రెస్ మంచిపేరు తెచ్చుకున్నప్పటికీ, ముఖ్యమంత్రి గెహ్లాట్, పైలెట్ గ్రూపుల మధ్య విభేదాలు ఓటమికి దారితీశాయని భావిస్తున్నారు. అలాగే మహిళలపై అత్యాచారాలు, దాడులకు సంబంధించిన కేసులు, తీవ్రమైన అవినీతి ప్రచారం కాంగ్రెస్ ఓటమికి కారణమయ్యారు. 2022 జూన్ నాటికి ఉదయ్‌పూర్‌లో టైలర్ కన్హయలాల్‌ను చంపివేసిన తర్వాత మతపరమైన గొడవలు జరిగాయి. ఇది ఎన్నికల్లో ప్రచారానికి, తద్వారా ఓట్లు పెరగడానికి దోహదం చేసింది. మోదీ ఇచ్చిన హామీలు ఆయా పథకాల అమలుకు గ్యారంటీ కార్డు బాగా పనిచేసింది. అలాగే వసుంధరరాజే ఇతర సీనియర్ నాయకులను కూడా ప్రచారంలోకి తీసుకు రావడంలో మోదీ విజయం పొందారు. కాంగ్రెస్ టిక్కెట్ల పంపిణీల విషయంలో సరైన నిర్ణయాలు తీసుకోకపోవడంలో ఓటమికి దారితీసింది. కొత్త అభ్యర్థులను పోటీకి నిలపడం కూడా బీజేపీకి కలిసివచ్చింది. ఇప్పుడు పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని నూతన భారతం, నూతన రాజకీయ కోణాలు హిందుత్వ ప్రచారం ద్వారా గెలుపును పొందవచ్చునని బీజేపీ ప్రణాళికను రూపొందించుకుంటున్నది. మహిళలకు, రైతులకు అనుకూలంగా సామాజిక సంక్షేమం, అవినీతి వ్యతిరేక అంశాలను ప్రధానంగా తీసుకుని ఎన్నికల ప్రచారంలోకి దిగాలని మోదీ, బీజేపీ భావిస్తున్నాయి. ఈ సారి కాంగ్రెస్ కూడా ప్రచారవ్యూహాన్ని మార్చుకునేందుకు సిద్ధమైంది. అలాగే వివిధ రాష్ట్రాల్లో సీట్ల సర్దుబాటు, ప్రచార కార్యక్రమంలాంటి అంశాలపై డిశంబరు 19న సమావేశమై చర్చించారు.

తమిళనాట వర్ష బీభత్సం

పది మంది మృతి

జలదిగ్బంధంలో తిరునెల్వేలి, తూత్తుకుడి

విద్యాసంస్థలకు సెలవులు

అనేక రైళ్లు రద్దు

చెన్నై: తమిళనాడులో వర్ష బీభత్సం కొనసాగుతోంది. మిచౌంగ్ తుపాను మిగిల్చిన నష్టాన్ని భర్తీ చేయకముందే ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు దక్షిణాది రాష్ట్రం అతలాకుతలమవుతోంది. అనేక జిల్లాల్లో జనజీవనం స్తంభించింది. రవాణా నిలిచిపోయింది. తిరునెల్వేలి, తూత్తుకుడి జిల్లాల్లో వర్ష ప్రభావం తీవ్రంగా ఉంది. అక్కడి బడులు, కళాశాలలకు సెలవు ప్రకటించారు. వర్ష సంబంధిత ఘటనల్లో బుధవారం నాటికి 10 మంది మరణించారు. గోడ కూలడం, విద్యుదాఘాతానికి గురి కావడంతో తిరునెల్వేలి, తూత్తుకుడి జిల్లాల్లో మరణాలు సంభవించినట్లు సెక్రటేరియట్‌లో విలేకరులతో మాట్లాడిన సీనియర్ అధికారి తెలిపారు. ఐఎండీ అంచనా తప్పిందని, అందుకు భిన్నంగా దక్షిణాది జిల్లాలలో వర్షం దంచికొడుతోందన్నారు.

రెండు జిల్లాలలో రికార్డు వర్షపాతం నమోదు కాగా వరదలు ముంచెత్తుతున్నట్లు తెలిపారు. వర్షాల కారణంగా రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. అనేక రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే ప్రకటించింది. రద్దైన రైళ్ల జాబితాను విడుదల చేసింది. నాగర్‌కోయిల్-కన్యాకుమారి, నాగర్‌కోయిల్, తిరునెల్వేల్లి ఎక్స్‌ప్రెస్ స్పెషల్ రైళ్లు పూర్తిగా నిలిచిపోయినట్లు వెల్లడించింది.

విపత్తుగా ప్రకటించండి: ప్రధానికి సీఎం వినతి

మిచౌంగ్‌తో పాటు భారీ వర్షాలతో తమిళనాడు తీవ్రంగా నష్టపోయిందని, ఈ పరిస్థితిని ప్రకృతి విపత్తుగా ప్రకటించాలని ప్రధాని మోదీని సీఎం స్టాలిన్ కోరారు. ఆయనను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. 100 ఏళ్ల చరిత్రలో వర్షాల వల్ల ఇంతటి నష్టం జరగలేదని తెలిపారు. ప్రజల జీవితాలను చక్కబెట్టేందుకు, ప్రభుత్వ మౌలిక వసతుల మరమ్మతుల కోసం సహాయనిధిని కోరారు. జాతీయ విపత్తు నిధి నుంచి తక్షణ సాయాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. తమ రాష్ట్రం రెండు విపత్తులను వెంటవెంటనే ఎదుర్కొన్నదని ప్రధాని దృష్టికి స్టాలిన్ తీసుకెళ్లారు. సాధ్యమైనంత త్వరగా నిధులివ్వాలని, వెంటనే రూ.7,300 కోట్లు ఇచ్చి శాశ్వత పరిహారంగా రూ.12వేల కోట్లు ఇవ్వాలని ప్రధానిని కోరారు. వరద బాధితుల కోసం రూ.6000 పరిహారాన్ని తాము ప్రకటించామని, పంపిణీ జరుగుతోందని స్టాలిన్ చెప్పారు. ప్రధాని సహాయక నిధి అందినప్పుడు సహాయక చర్యలు పూర్తి కాగలవన్నారు. తిరునెల్వేలి, తూత్తుకుడి జిల్లాలలో వర్ష బీభత్సం, కయల్‌పట్టణంలో 94సీఎంల వర్షపాతం నమోదును ప్రస్తావించారు. ఎనిమిది మంది మంత్రులు, పది మంది ఐఏఎస్‌లు రంగంలోకి దిగారని, 15 ఎస్డీఆర్ఎఫ్ బృందాలు, 10 ఎన్డీఆర్ఎఫ్ బృందాలతో పాటు ఇతర దళాలు సహాయక చర్యల్లో నిమగ్నమైనట్లు చెప్పారు. 12,553 మందిని కాపాడి 143 శిబిరాలకు తరలించినట్లు తెలిపారు. హెలికాప్టర్లతో వరద పీడిత ప్రాంతాల్లో ఆహారం పంపిణీ జరుగుతోందని అన్నారు. తనతో పాటు సీఎస్ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ సంబంధిత అధికారులకు అవసరమైన ఆదేశాలిస్తున్నట్లు సీఎం వెల్లడించారు.

ఆధారాలిస్తే విచారిస్తాం

పన్నూ హత్యకు కుట్రపై ప్రధాని మోదీ

న్యూదిల్లీ: ఖలిస్థానీ ఉగ్రవాది, నిషేధిత 'సిక్ ఫర్ జస్టిస్' నేత గురుపత్వంత్ సింగ్ పన్నూ హత్యకు అమెరికాలో కుట్ర చేసినట్లు భారతీయులపై వచ్చిన అభియోగాలకు సంబంధించి ప్రధాని నరేంద్రమోదీ మొదటిసారిగా స్పందించారు. భారత దేశ పౌరులు ఇతర దేశాల్లో మంచి లేదా చెడు చేసినట్లు సమాచారం ఇస్తే దానిపై విచారణ జరిపేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మోదీ తెలిపారు. అదే సమయంలో భారత్-అమెరికా మధ్య ద్వైపాక్షిక సంబంధాలకు ఇటీవలి కాలంలో చోటుచేసుకున్న కొన్ని సంఘటనలతో ముడిపెట్టడం భావ్యం కాదని మోదీ వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ వార్తా సంస్థకు బుధవారం ఇచ్చిన ముఖాముఖిలో ఓ ప్రశ్నకు సమాధానంగా ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. భారత దేశ పౌరులు ఇతర దేశాల్లో ఏదైనా పొరపాటు చేసినట్లు సమాచారం వస్తే దానిపై విచారణ జరిపేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంటుందని, చట్టానికి లోబడి పాలన చేసేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మోదీ చెప్పారు. అదేవిధంగా భారత్‌కు వ్యతిరేకంగా కొన్ని ఉగ్రవాద గ్రూపులు విదేశాల్లో కార్యకలాపాలు నిర్వహించడం ఆందోళనకరమని స్పష్టంచేశారు. భావప్రకటనా స్వేచ్ఛ పేరుతో ఉగ్రవాదులు హింసను ప్రేరేపిస్తున్నారని, ఇటీవలి కాలంలో చోటుచేసుకున్న కొన్ని సంఘటనలను భారత్-అమెరికా ద్వైపాక్షిక సంబంధాలతో ముడిపెట్టడం భావ్యం కాదని వ్యాఖ్యానించారు. ఎంతోకాలంగా రెండు దేశాల మధ్య ద్వైపాక్షికంగా బలమైన సంబంధాలు ఉన్నాయని మోదీ అన్నారు. కొద్ది రోజుల క్రితం అమెరికా గడ్డపై పన్నూ హత్యకు కుట్ర జరిగిందని, దాన్ని తాము భగ్నం చేశామని ఇటీవల అమెరికా చెప్పిన విషయం తెలిసిందే.

మిషన్ మోడ్‌లో నియామకాలు

కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్

న్యూదిల్లీ: కేంద్రప్రభుత్వ ఉద్యోగాలను 'మిషన్ మోడ్'లో భర్తీ చేస్తున్నట్లు కేంద్రం తెలిపింది. ఉపాధి కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తూ దానికి కట్టుబడి ఉన్నట్లు పేర్కొంది. ఇదే క్రమంలో రోజ్‌గార్ మేళ నిర్వహించి దశలవారీగా ఉద్యోగాలను భర్తీ చేస్తున్నట్లు కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ రాతపూర్వకంగా దిగువ సభకు వెల్లడించారు. రోజ్‌గార్ మేళాలను దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాటి ద్వారా కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాలు, ప్రభుత్వ రంగ సంస్థలు (సీపీఎస్‌యూ),విద్య, ఆరోగ్యం, ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో నియామకలు జరుగుతున్నట్లు తెలిపారు. ఖాళీల భర్తీ అన్నది నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు. ఆత్మనిర్భర్ ప్యాకేజి ద్వారా వాణిజ్య-ఉపాధి అవకాశాలను మెరుపరుస్తున్నట్లు తెలిపారు. దీర్ఘకాలిక పథకాలు/ కార్యక్రమాలు/ విధానాల ద్వారా దేశాన్ని స్వీయసమృద్ధిగా తీర్చిదిద్దే కసరత్తు కొనసాగుతోందన్నారు. ఆత్మనిర్భర్ భారత్ రోజ్‌గార్ యోజన, ప్రొడక్షన్ లింక్డ్ ఇన్‌సెంటివ్ స్కీములు, పీఎం గతిశక్తి, ప్రధానమంత్రి యోజన, ప్రధానమంత్రి వీధి విక్రేతల ఆత్మనిర్భర్ నిధి తదితర పథకాలు అమల్లో ఉన్నట్లు కేంద్రమంత్రి తెలిపారు. మేకిన్ ఇండియా, స్టార్టప్ ఇండియా, డిజిటల్ ఇండియా, స్మార్ట్ సిటీ మిషన్, అటల్ మిషన్ వంటివి చేపడుతున్నట్లు వెల్లడించారు. ఇవన్నీ యువత కోసం ఉద్యోగాల కల్పనకు దోహదమవుతున్నాయన్నారు. రాష్ట్ర స్థాయిలో రోజ్‌గార్ మేళా, పథకాల వివరాలు రాష్ట్రాల వద్దనే ఉన్నట్లు సింగ్ తెలిపారు.

150 మంది ఎంపీలను గెంటేస్తే చర్చేది

మీడియాను ప్రశ్నించిన రాహుల్

న్యూదిల్లీ: ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ జగ్‌దీప్ ధన్కర్‌ను అనుకరిస్తూ టీఎంసీ నేత చేసిన మిమిక్రీని వీడియో తీయడంపై కాంగ్రెస్ సీనియర్ నేత, వయనాడ్ ఎంపీ రాహుల్ గాంధీ తొలిసారి స్పందించారు. సభ నుంచి 150 మంది ఎంపీలను గెంటేశారని, దానిపై మాత్రం ఎలాంటి చర్చా లేదని మండిపడ్డారు. కనీసం ఒక చిన్న వార్తయినా మీరు చూపించండి అంటూ మీడియాను రాహుల్ నిలదీశారు. 'ఎంపీలు అక్కడ కూర్చున్నారు. దానిని నేను వీడియో తీశాను. నా ఫోనులో నేను వీడియో తీశాను. మీడియా దానిని చూపిస్తోంది. 150 మంది మా ఎంపీలను సభ నుంచి బయటకు విసిరేశారు. దానిపై మీడియాలో చర్చే లేదు. అదానీపై చర్చ లేదు, రాఫెల్‌పై చర్చ లేదు, నిరుద్యోగితపై చర్చలేదు. మా ఎంపీలు మనస్తాపంతో పార్లమెంటు బయట కూర్చున్నారు. కానీ దీనిపై ఏదైనా వార్త ఉందేమో చూపించండి. ఇది మీ బాధ్యత. కానీ మీరు కేవలం మిమిక్రీ గురించి మాత్రమే మాట్లాడుతున్నారు' అని మీడియాను రాహుల్ ఎదురు ప్రశ్నించారు.

రాజకీయం చేయొద్దు

కరోనాపై కేంద్రం

న్యూదిల్లీ: జేఎన్.1 సబ్ వేరియంట్ కారణంగా దేశంలో కోవిడ్ కేసులు మళ్లీ పెరగడంపై కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. వైరస్ వ్యాప్తి నియంత్రణ, ఆసుపత్రుల సన్నద్ధతపై కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ బుధవారం రాష్ట్రాల అధికారులతో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాలకు ఆయన కీలక సూచనలు చేశారు. ప్రతి మూడు నెలలకోసారి ఆసుపత్రుల్లో మాక్ డ్రిల్ నిర్వహించాలని సూచించారు. మనమంతా సమష్టిగా పనిచేయాల్సిన సమయమిదని, మళ్లీ కోవిడ్ వ్యాప్తిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి చెప్పారు. కానీ, అప్రమత్తంగా ఉండాలని, ఆసుపత్రుల సన్నద్ధత, వైరస్ వ్యాప్తిని నిరోధించడం, ప్రజలకు అవగాహన కల్పించడంపై మనం సిద్ధంగా ఉండాలని సూచించారు. ఆరోగ్యపరమైన అంశాలను రాజకీయం చేయొద్దని, రాష్ట్రాలకు కేంద్రం పూర్తిగా సహకరిస్తుందని కేంద్రమంత్రి మాండవీయ తెలిపారు. పండగ సీజన్‌తో పాటు చలి కాలం కారణంగా వైరస్ వ్యాపించకుండా నియంత్రణ చర్యలు తీసుకోవాలని అన్ని రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంతాలను ఆయన కోరారు. దేశంలో కొన్నిరోజుల క్రితం వెలుగు చూసిన కోవిడ్-19 ఉపరకం జేఎన్.1 వ్యాప్తిపై కేంద్ర ఆరోగ్యశాఖ ఇప్పటికే అన్ని రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. ఇదే సమయంలో ఈ ఉపరకానికి సంబంధించి మూడు రాష్ట్రాల్లో ఇప్పటివరకు 20 కేసులు గుర్తించినట్లు కేంద్ర ఆరోగ్యశాఖ పరిధిలోని ఇండియన్ సార్స్-కోవ్2 జీనోమిక్స్ కన్సార్టియం వెల్లడించింది. గోవాలో అత్యధికంగా 18, కేరళ, మహారాష్ట్రలో ఒక్కొక్కటి చొప్పున కోవిడ్-19 ఉపరకం కేసులు నమోదైనట్లు తెలిపింది.

ధన్కర్‌ను అగౌరవపర్చే ఉద్దేశం మా ఎంపీకి లేదు

మమత

న్యూదిల్లీ: టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ రాజ్యసభ ఛైర్మన్ జగ్‌దీప్ ధన్కర్‌ను అనుకరిస్తూ మిమిక్రీ చేసిన విషయంపై ఆ పార్టీ అధినేత్రి, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మతాబెనర్జీ స్పందించారు. ధన్కర్‌ను అగౌరవపరిచేలా చేయడం, అవమానించడం తమ పార్టీ ఎంపీ ఉద్దేశం కాదన్నారు. మిమిక్రీపై దుమారం రేగిన క్రమంలో తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ కూడా ధన్కర్ మనసు గాయపరిచే లేదా అగౌరవపరిచే ఉద్దేశం తనకు ఎప్పుడూ లేదని స్పష్టం చేశారు. మిమిక్రీ వివాదం గురించి అడిగిన ప్రశ్నకు మమతా బెనర్జీ స్పందిస్తూ... "మేము ప్రతి ఒక్కరినీ గౌరవిస్తాము. ఇది అగౌరవం కాదు. ఇది కేవలం రాజకీయంగా సాధారణ విషయం... రాహుల్ జీ రికార్డ్ చేయకపోతే మీకు ఇది కూడా తెలియదు" అన్నారు. రాష్ట్రానికి పెండింగ్‌లో ఉన్న కేంద్ర నిధులపై ప్రధాని నరేంద్ర మోదీని కలిసేందుకు దిల్లీ వచ్చిన మమత బుధవారం పార్లమెంట్ కాంప్లెక్స్‌లో ఉన్నారు. తాను ఎవరినీ బాధపెట్టాలని అనుకోవడం లేదని, అయితే మిమిక్రీ చర్యపై క్షమాపణలు చెప్పే ఉద్దేశం లేదని కల్యాణ్ బెనర్జీ స్పష్టం చేశారు. 'మిమిక్రీ నేరం కాదు, ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేయడం సరైనదేనా అనే ప్రధాన సమస్యపై నుంచి దృష్టి మళ్లించడానికి వారు ప్రయత్నిస్తున్నారు" అని టీఎంసీ అన్నారు. గతంలో ప్రధాని నరేంద్ర మోదీ కూడా దీనిని చేశారని పేర్కొన్నారు. "ఉపరాష్ట్రపతితో సహా ఎవరినీ నొప్పించాలనే ఉద్దేశ్యం నాకు అస్సలు లేదు. రాజ్యాంగ పదవుల పట్ల గౌరవం ఉంది" అన్నారు.

మంచిదేగానీ గెలవడమే పెద్ద సవాల్

ఖడ్గేకు ప్రధాని అభ్యర్థిత్వంపై ప్రియాంక్ ఖడ్గే

కాల్బుర్గి: కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.మల్లికార్జున ఖడ్గేకు ఇండియా కూటమి తరపున ప్రధాని అభ్యర్థిత్వం లభిస్తే మంచిదేగానీ... సార్వత్రిక ఎన్నికల్లో గెలవడం, మెజారిటీ సాధించడమన్నది పెద్ద సవాల్‌గా ఉందని ఖడ్గే తనయుడు, కర్నాటక మంత్రి ప్రియాంక్ ఖడ్గే అన్నారు. పగటి కలలు మానుకొని క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించడంపై పూర్తిగా దృష్టిని కేంద్రీకరించడం కాంగ్రెస్‌కు, కూటమికి అవసరమని నొక్కిచెప్పారు. కర్నాటక, కాల్బుర్గిలో విలేకరులతో మాట్లాడిన ప్రియాంక్ 'ఓ కన్నడిగ ప్రధాని అవుతుంటే మీరు వద్దంటారా?' అని పాత్రికేయులను ఎదురు ప్రశ్నించారు. ఆయన (ఖడ్గే)కు అభ్యర్థిత్వం లభిస్తే మంచిదేగానీ 200-250 స్థానాల్లో కాంగ్రెస్ గెలవడమే పెద్ద సవాల్‌గా ఉంది. ఇండియా కూటమిలోని పార్టీలతో కలిసి గెలుపునకు అనుకూల వాతావరణాన్ని సృష్టించుకోవాలి. సాధ్యమైనన్ని స్థానాల్లో గెలుపుపైనే దృష్టి పెట్టాలి. ఆ తర్వాతే మిగతా విషయాలను ఆలోచించాలి' అని ప్రియాంక్ అన్నారు. మంగళవారం జరిగిన ఇండియా భేటీలో ఖడ్గే పేరును ప్రధాని అభ్యర్థిగా కొందరు ప్రతిపాదించగా దీనిపై నిర్ణయం జరగలేదు. అయితే పదవి ఆశ లేదని, అణగారిన, వెనుకబడిన వర్గాల కోసం పనిచేయడమే ధ్యేయమని ఇండియా భేటీలో ఖడ్గే అన్నారు. 'ముందు గెలుద్దాం. ఆ తర్వాత మిగతావి ఆలోచిద్దాం' అని ఆయన సూచించారు.

మధ్యప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్‌గా తోమర్

భోపాల్: మధ్యప్రదేశ్ శాసనసభ సభాపతిగా బీజేపీ సీనియర్ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్పీకర్‌గా 66ఏళ్ల తోమర్ పేరును ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ ప్రతిపాదించారు. ప్రతిపక్ష నాయకుడు ఉమంగ్ సిఘర్ సమర్థన తెలిపారు. మాజీ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ కూడా తోమర్ పేరునే ప్రతిపాదించగా కేంద్ర మాజీ మంత్రి ప్రహ్లాద్ పటేల్ మద్దతిచ్చారు. ప్రతిపక్ష కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అజయ్ సింగ్, జైవర్ధన్ సింగ్, రాజేంద్ర కుమార్ సింగ్ కూడా తోమర్ పేరును ప్రతిపాదించారు. మొత్తం ఐదు ప్రతిపాదనలు తోమర్‌కు వచ్చాయి. దీంతో మూజువాణి ఓటు అనంతరం స్పీకర్‌గా తోమర్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రోటెం స్పీకర్ గోపాల్ భార్గవ ప్రకటించారు. స్పీకర్ పదవి కోసం తోమర్ సోమవారం నామినేషన్ దాఖలు చేశారు.

'విపానస'కు కేజ్రీవాల్

ఈడీ విచారణకు మళ్లీ గైర్హాజరు?

న్యూదిల్లీ: మద్యం కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఎదుట ఆప్ జాతీయ కన్వీనర్, దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ హాజరయ్యే పరిస్థితి కనిపించడం లేదు. ఈ కేసులో డిసెంబరు 21న (గురువారం) తమ ఎదుట హాజరుకావాలని కేజ్రీవాల్‌కు ఇప్పటికే ఈడీ సమన్లు పంపింది. కేజ్రీవాల్ బుధవారం విపాసన కార్యక్రమానికి వెళ్లారు. కేజ్రీవాల్ ఏటా చలికాలంలో విపాసన ధ్యానం చేస్తున్న విషయం తెలిసిందే. గతంలో బెంగళూరు, జైపూర్ వంటి నగరాల్లో ఆయన ఈ శిక్షణకు హాజరయ్యారు. ఈసారి ఎక్కడికి వెళ్లేది ఆయన వెల్లడించలేదు. అయితే, కేజ్రీవాల్ విపాసనకు బయల్దేరినట్లు ఆప్ వర్గాలు వెల్లడించాయి. ఈ కార్యక్రమం వరుసగా 10 రోజుల పాటు కొనసాగనుంది. దీంతో గురువారం నాటి ఈడీ విచారణకు ఆయన మళ్లీ గైర్హాజరు కానున్నట్లు తెలుస్తోంది. ఈ కేసులో ఇప్పటికే కేజ్రీవాల్ ఓసారి ఈడీ విచారణకు హాజరుకాలేదు. మద్యం కుంభకోణం కేసులో తొలుత నవంబరు 2న విచారణకు రావాలని ఈడీ సమన్లు జారీ చేసింది. మధ్యప్రదేశ్ ఎన్నికల ప్రచారం కారణంగా ఆయన హాజరుకాలేదు. తాజాగా ఆయనకు ఈడీ మరోసారి సమన్లు జారీ చేసింది. ఈ సమన్లపై ఆప్ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. మద్యం కుంభకోణం కేసులో ఇప్పటికే సీబీఐ... కేజ్రీవాల్‌ను విచారించింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆయనను 9 గంటల పాటు ప్రశ్నించింది.

ధన్కర్‌కు ఎన్డీయే ఎంపీల సంఘీభావం

న్యూదిల్లీ: ఎంపీల సస్పెన్షన్లను వ్యతిరేకిస్తూ పార్లమెంట్ ప్రాంగణంలో జరిగిన నిరసన ప్రదర్శనపై తీవ్ర దుమారం కొనసాగుతోంది. ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్కర్‌ను అనుకరిస్తూ తృణమూల్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ వ్యవహరించిన తీరును ఎన్డీయే నేతలు తీవ్రంగా ఖండించారు. దీంతో ధన్కర్‌కు సంఘీభావంగా అధికార పక్ష ఎంపీలు బుధవారం రాజ్యసభలో కొద్దిసేపు నిల్చునే సభా కార్యకలాపాల్లో పాల్గొన్నారు. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషీ మాట్లాడుతూ ఈ ఘటనను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని, విపక్షాలు అన్ని హద్దులు దాటుతున్నట్లు ఎదురుదాడి చేశారు. రాజ్యాంగ పదవుల్లో ఉన్న వ్యక్తులను పదేపదే అవమానిస్తున్నారని, 20 ఏళ్లుగా ప్రధాని మోదీ ఇలాంటి అవమానాలే ఎదుర్కొంటున్నారని చెప్పుకొచ్చారు. ఉపరాష్ట్రపతిని అవమానిస్తే సహించేది లేదని, మీ మీద గౌరవంతో విపక్ష ఎంపీల చర్యలకు నిరసనగా ఈ ప్రశ్నోత్తరాల గంట మొత్తం నిలబడే పాల్గొంటామని మంత్రి వెల్లడించారు. ఎన్డీయే ఎంపీలంతా నిలబడి ఉండగా కొన్ని నిమిషాల పాటు ప్రశ్నోత్తరాలు కొనసాగాయి. ఆ తర్వాత ఛైర్మన్ ధన్కర్ స్పందిస్తూ మీ సంఘీభావం తన మనసును తాకిందని, మీరంతా కూర్చోవాలని కోరుతున్నానన్నారు. అనంతరం అధికార పక్ష ఎంపీలంతా వారి సీట్లలో కూర్చుని సభా కార్యకలాపాల్లో పాల్గొన్నారు. సస్పెన్షన్‌కు గురైన సభ్యులు పార్లమెంటు భవన మెట్లపై కూర్చొని నిరసన తెలుపుతూ ఉపరాష్ట్రపతి ధన్కర్‌ను అనుకరిస్తూ తృణమూల్ నేత కల్యాణ్ బెనర్జీ చేసిన హాస్య ప్రదర్శనను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చిత్రీకరించారు. మరికొందరు నేతలు స్పీకర్‌ను అనుకరించారు. ఈ ఘటన తనను బాధించిందని ధన్కర్ పేర్కొన్నారు.

ధన్కర్‌కు రాష్ట్రపతి, ప్రధాని మద్దతు

న్యూదిల్లీ: పార్లమెంట్ ప్రాంగణంలో జరిగిన నిరసన ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎన్నికైన ప్రజాప్రతినిధుల భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ ఇతరుల మర్యాదకు భంగం కలిగించేలా ఉండకూడదని హితవు పలికారు. పార్లమెంటును, ఉపరాష్ట్రపతిని అవమానిస్తే సహించేది లేదని హెచ్చరిక జారీ చేశారు. అలాగే ఈ ఘటనపై ప్రధాని మోదీ కూడా తనకు ఫోన్ చేశారని ఉపరాష్ట్రపతి ధన్కర్ వెల్లడించారు. మోదీ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారని ఎక్స్ వేదికగా తెలిపారు. 'పార్లమెంట్ ప్రాంగణంలో చోటుచేసుకున్న నిరసన ఘటనపై మోదీ నాకు ఫోన్ చేశారు. ఈ పవిత్ర ప్రదేశంలో ఎంపీలు వ్యవహరించిన తీరుపై ఆయన ఆక్షేపణ తెలిపారు. 20 ఏళ్లుగా తానుకూడా అలాంటి అవమానాలే ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. కానీ, పార్లమెంట్ వేదికగా రాజ్యాంగ పదవిలో ఉన్న వారి విషయంలో ఇలా జరగడం దురదృష్టకరమని విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటన తన కర్తవ్య నిర్వహణను అడ్డుకోలేదని మోదీకి వెల్లడించానన్నారు. ఇవన్నీ తనమార్గాన్ని మార్చలేవని, తాను రాజ్యాంగ విలువలకు కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశానని ధన్కర్ ట్వీట్‌లో వెల్లడించారు.

అయోధ్యకు విమాన సర్వీసులు

న్యూదిల్లీ: రామమందిరం ప్రారంభం వేళ అయోధ్య నగరానికి విమాన సర్వీసులు నడపనున్నట్లు ప్రముఖ విమానయాన సంస్థ ఎయిరిండియా ప్రకటించింది. ఇందులో భాగంగా డిసెంబర్ 30న తొలిసారి దిల్లీ నుంచి అయోధ్యకు విమానం నడపనున్నట్లు వెల్లడించింది. ఆ తర్వాత జనవరి 16 నుంచి ఈ మార్గంలో ప్రయాణికులకు రోజువారీ సేవలు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపింది. డిసెంబర్ 30న దిల్లీలో ఉదయం 11గంటలకు విమానం బయల్దేరి... మధ్యాహ్నం 12.20 గంటలకు అయోధ్యలోని మర్యాద పురుషోత్తమ్ శ్రీరామ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంటుందని అధికారులు తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం 12.50 గంటలకు అయోధ్యలో బయల్దేరి మధ్యాహ్నం 2.10గంటలకు దిల్లీ చేరుకుంటుందన్నారు. అయోధ్యలో నిర్మించిన విమానాశ్రయ ప్రారంభోత్సవం జరిగిన వెంటనే అక్కడికి తమ సర్వీసులు నడిపేందుకు ఉత్సాహంగా ఉన్నామని, ఇది దేశ వ్యాప్తంగా టైర్ 2, టైర్ 3 నగరాల నుంచి కనెక్టివిటీని పెంచాలన్న తమ నిబద్ధతకు నిదర్శనమని ఎయిరిండియా ఎండీ అలోక్ సింగ్ తెలిపారు. కాగా, దిల్లీ నుంచి అయోధ్య విమానాశ్రయానికి డిసెంబర్ 30న తొలిసారి విమానం నడపనున్నట్లు ఇప్పటికే ఇండిగో ప్రకటించింది. ఆ తర్వాత జనవరి 6 నుంచి రోజువారీ సర్వీసులు ప్రారంభిస్తామని తెలిపింది.

బీజేపీ ఎంపీని ఎందుకు ప్రశ్నించలేదు: కాంగ్రెస్

న్యూదిల్లీ: పార్లమెంట్ భద్రతా వైఫల్యం ఘటనపై కాంగ్రెస్ మరోసారి కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించింది. లోక్‌సభలో అలజడి సృష్టించిన దుండగులకు పాస్ ఇచ్చిన బీజేపీ ఎంపీని ఇంతవరకు ఎందుకు ప్రశ్నించలేదని ప్రశ్నించింది. ఈ ఘటన జరిగి వారం రోజులు గడిచిందని, ఈ ఘటనపై విచారణ ప్రారంభమైనట్లు ప్రధాని, హోంమంత్రి, లోక్‌సభ స్పీకర్ ప్రకటించారు గానీ...ఆ దుండగులకు పాస్‌లు ఇచ్చిన బీజేపీ ఎంపీ ప్రతాప్ సింహాను ఇప్పటిదాకా ఎందుకు ప్రశ్నించలేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ బుధవారం ఎక్స్ వేదికగా నిలదీశారు. డిసెంబర్ 13 ఘటనపై హోంమంత్రి ప్రకటన కోసం చట్టబద్ధ డిమాండ్ చేసిన 143 మందికిపైగా ఎంపీలను సస్పెండ్ చేశారని విమర్శించారు.

ప్రభుత్వోద్యోగులకు ముందస్తు వేతనం

మూడు శాతం డీఏ పెంపు: సీఎం సంగ్మా

షిల్లాంగ్: క్రిస్మస్ పండుగ సందర్భంగా మేఘాలయ ప్రభుత్వం తమ ఉద్యోగులకు తీపికబురు చెప్పింది. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులందరికీ ముందస్తుగానే డిసెంబర్ వేతనం ఇవ్వాలని సీఎం కన్రాడ్ సంగ్మా నిర్ణయించారు. కరువు భత్యం(డీఏ) మూడు శాతం పెంచుతున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ నిర్ణయంతో 55 వేల మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది. ఈ విషయాన్ని సీఎం కన్రాడ్ సంగ్మా తన 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. 55వేల మంది ప్రభుత్వ ఉద్యోగులతో కూడిన తమ జట్టుకు క్రిస్మస్ శుభాకాంక్షలు. డిసెంబరు నెల వేతనాలు ముందుగానే విడుదల చేస్తున్నామని సంతోషంగా ప్రకటిస్తున్నాం. డీఏ 3 శాతం పెంపునకు ఆమోదం లభించిందని పేర్కొన్నారు. దీంతో రాష్ట్ర ఉద్యోగులు, పెన్షనర్లకు ఇస్తున్న డీఏ 36 శాతం నుంచి 39 శాతానికి పెరిగింది. పెరిగిన ఈ డీఏ 2023 జులై 1 నుంచి అమలు చేయనున్నారు.

మతోన్మాద పార్టీని తరిమికొడదాం

- ప్రజాచైతన్యంలో కళాకారులదే అగ్రస్థానం: రామకృష్ణ
- మానవీయ విలువలు కాపాడుకోవాలి: గని
- ఉత్తేజంగా ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి 'ఆట-పాట-మాట'

విశాలాంధ్ర-విజయవాడ: ప్రజల మధ్య చిచ్చుపెడుతూ రాజ్యమేలుతున్న మతోన్మాద బీజేపీని తరిమికొట్టాల్సిన అవసరం ఏర్పడిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. 'కళ కళ కోసం కాదు- కళ ప్రజల కోసం' నినాదంతో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి గుంటూరు నుంచి విజయవాడ వరకు చేపట్టిన పాదయాత్ర ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రామకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. స్థానిక భవానీపురం శివాలయం సెంటర్‌లో ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రనాయక్ అధ్యక్షతన బుధవారం జరిగిన సభలో రామకృష్ణ మాట్లాడుతూ దేశం ప్రమాదంలో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఇంతటి ప్రమాదకర పరిస్థితులు ఎన్నడూ రాలేదన్నారు. కులాలు, మతాలు, వివిధ భాషలు మాట్లాడేవారు సమైక్యంగా ఉండటానికి బాబాసాహెబ్ అంబేద్కర్ ఇచ్చిన రాజ్యాంగమే కారణమన్నారు. ఇప్పుడు ఆ రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారని మండిపడ్డారు. రాజ్యాంగ విలువలను కాపాడుకోవాల్సి బాధ్యత అందరిపై ఉందన్నారు. అధికారంలో ఉన్న మతోన్మాద పార్టీ ఇతర మతస్తులను ద్వితీయశ్రేణి పౌరులుగా చూస్తున్నదని విమర్శించారు. బీజేపీ ఎంపీ ఇచ్చిన పాస్‌తో పార్లమెంట్‌లోకి ప్రవేశించిన అగంతకులు అల్లరి సృష్టించిన అంశంపై హోంమంత్రి సమాధానం చెప్పాని విపక్షాలు డిమాండ్ చేస్తుంటే... వారిని సస్పెండ్ చేస్తున్నారని ఆరోపించారు. లోక్‌సభలో, రాజ్యసభలో మొత్తం 143 మంది పార్లమెంట్ సభ్యులను సస్పెండ్ చేయటం దుర్మార్గమన్నారు. సాధారణ ప్రజల సమస్యలు పట్టించుకోవటం లేదన్నారు. అంబానీ, అదానీల సంపద పెంచేందుకు బీజేపీ పరిపాలన చేస్తున్నదన్నారు. పార్లమెంట్ సభ్యులను సస్పెండ్ చేయటాన్ని ఖండిస్తూ ఈ నెల 22న రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

తల్లకిందులుగా తపస్సు చేసినా అమరావతే రాజధాని

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తల్లకిందులుగా తపస్సు చేసినా రాజధానిగా అమరావతే ఉంటుందని రామకృష్ణ స్పష్టం చేశారు. విశాఖలో 450 కోట్ల రూపాయలతో ఇల్లు నిర్మించుకుని, కేవలం బాత్‌రూం కోసం రూ.25 లక్షలు ఖర్చుపెట్టిన ముఖ్యమంత్రి...పేదల పక్షపాతి ఎలా అవుతారని, పేదలను పీడిస్తున్న సీఎంగా జగన్ మారారని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని, దేశ సంస్కృతిని కళాకారులు కాపాడుకోవాలన్నారు. ప్రజానాట్య మండలి కళాకారులను సన్మానించారు.

ఇప్టా జాతీయ కార్యదర్శి గని మాట్లాడుతూ రోజు రోజుకి దెబ్బతింటున్న మానవ సంబంధాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. యువత పెడదోవపడుతున్న పరిస్థితుల్లో వారి ఆలోచనల్లో మార్పు తీసుకురావాల్సి ఉందన్నారు. శాంతి, ప్రేమ, కరుణ, మంచితనం, మానవత్వం, సమానత్వం, సౌభ్రాతృత్వం కోసం దేశ సమైక్యత, సమగ్రత కోసం ప్రజానాట్య మండలి కళాకారులు పనిచేస్తున్నారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య మాట్లాడుతూ ప్రజాచైతన్యం కోసం ప్రజల కష్టసుఖాల్లో పాలు పంచుకుంటూ వారి అంశాలను ఇతివృత్తాలుగా తీసుకొని ప్రజానాట్య మండలి కళాప్రదర్శనలు చేస్తున్నదన్నారు. గుంటూరు నుంచి విజయవాడ వరకు 22 మంది కళాకారులు 50 కిలోమీటర్లు పాదయాత్ర చేసినట్లు చెప్పారు. సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్.రామకృష్ణ, కోశాధికారి ఆర్.పిచ్చయ్య, కార్యవర్గ సభ్యులు ఆరేటి రామారావు, ఎ.శివయ్య, మహంత్ లక్ష్మణరావు, సీతారాంప్రసాద్, కుళ్లాయప్ప, దప్పు సూరి, బి.నాగభూషణం, పోతురాజు, నాగేశ్వరరావు, అనంతలక్ష్మీ, స్వర్ణసులోచన, విజయవాడ నగర ఇన్‌చార్జి లంక దుర్గారావు, గౌరవాధ్యక్షుడు కేవీ భాస్కరరావు, అధ్యక్షుడు ఎస్‌కే నజీర్, కార్యదర్శి దోనేపూడి సూరిబాబు, కాళ్ల చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి కళాకారుల పాదయాత్ర ప్రకాశం బ్యారేజీ నుంచి విజయవాడ నగరంలోకి ప్రవేశించి భవానీపురం వరకు సాగింది. బ్యారేజీ వద్ద సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అధ్వర్యంలో నగర సమితి, ప్రజానాట్యమండలి విజయవాడ నగర సమితి నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. సభా వేదికపై కళాకారులు ప్రదర్శించిన కళారూపాలు నవ్వులు కురిపించాయి. ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమపథకాల్లో లోపాలు, పెరుగుతున్న నిత్యావసరాల ధరలు తదితర అంశాలపై లఘునాటికలు ప్రదర్శించారు. పాఠశాల విద్యార్థులు చేసిన జానపద నృత్యాలు అలరించాయి. కళాకారులు పాటలు, ఆటలు, మధ్యమధ్యలో నాయకుల ప్రసంగాలతో సభా ప్రాంగణం ఉత్తేజితమైంది.

పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అపహాస్యం: శశి థరూర్

న్యూఢిల్లీ: పెద్ద సంఖ్యలో ఎంపీలను సస్పెండ్ చేయడం ద్వారా కేంద్రంలో నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ సర్కారు పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, తిరువనంతపురం ఎంపీ శశి థరూర్ విమర్శించారు. ఎంపీల సస్పెన్షన్‌పై విపక్షాల నిరసనలో పాల్గొన్న అనంతరం విలేకరులతో మాట్లాడుతూ... 'పార్లమెంటరీ ప్రజాస్వా మ్యా న్ని అపహాస్యం చేయడం కొద్దిరోద్ది జులుగా మనం చూస్తున్నాం. ప్రజాస్వా మ్య చరిత్రలో ప్రపంచంలోని ఏ దేశంలోనూ 150 మంది ఎంపీలను సస్పెండ్ చేయడం జరగలేదు. పార్లమెంట్‌లో భద్రత లోపంపై హోంమంత్రి వివరణ ఇవ్వాలని విపక్షాలు కోరినా ఆయన పార్లమెంటుకు రాలేదు. బయట ప్రకటనలు చేస్తున్నారు. ఇంటర్వ్యూలు ఇస్తున్నారు కానీ పార్లమెంటుకు రావడం లేదు. అందుకే ప్రతిపక్షాలు నిరసన వ్యక్తం చేశాయి. ప్రతిపక్షాన్ని బాధ్యతాయుతంగా పనిచేయనివ్వడంలో ప్రభుత్వా నికి ఆసక్తి లేదు' అని పేర్కొన్నారు. ఈ శీతాకాల సమావేశాలకు ప్రతిపక్షాలు పార్లమెంటు పనితీరుకు పూర్తిగా సహకరించాలని నిర్ణయించుకున్నాయని థరూర్ ఉద్ఘాటించారు. 'జాతీయ ప్రాముఖ్యత కలిగిన విషయాలపై ప్రధాన చర్చలలో ప్రతిపక్షాలు పాల్గొనాలని కోరుకుంటున్నాయి' అని ఆయన అన్నారు. అయితే పార్లమెంటులో ప్రతిపక్షాలను బాధ్యతాయుతంగా పనిచేయ నివ్వడంలో ప్రభుత్వానికి ఆసక్తి లేదని ఆయన విమర్శించారు. 'మేం అధికారంలో ఉన్నప్పుడు విపక్షాల ప్రయోజనాలకు అనుగుణంగా ఉండటం ఎంత ముఖ్యమో చూశాం. మేం అధికారంలో ఉండి ఉంటే హోంమంత్రి విపక్షాలతో చర్చలు జరిపేలా చేసేవాళ్లం' అన్నారు.

ధన్కర్ కుల ప్రస్తావన తేవడం సరికాదు: ఖడ్గే

న్యూఢిల్లీ: ప్రతి అంశానికి కులాన్ని ఆపాదించడం తగదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖడ్గే పేర్కొన్నారు. టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ చేసిన మిమిక్రీ వివాదంపై జగదీప్ ధన్కర్ రాజ్యసభలో 'కులం' ప్రస్తావన చేయడాన్ని ఆయన తప్పుపట్టారు. పార్లమెంటు వెలుపల ఆయన మీడియాతో మాట్లాడుతూ... తనపై వ్యక్తిగత దాడి జరిగిందని, ఒక రైతు కులాన్ని అవమాన పరిచారని ధన్కర్ పేర్కొనాన్ని ప్రస్తావిస్తూ... ఇక్కడ కుల ప్రస్తావన ఎందుకని ఖడ్గే ప్రశ్నించారు. 'ఎవరూ ఇలా మాట్లాడకూడదు. రెచ్చగొట్టే మాటలకు దూరంగా ఉండాలి' అని పేర్కొన్నారు. 'చైర్మన్ తనను కులం కారణంగానే అవమానించారని, రైతులను అవమానపరిచారని మాట్లాడారు. నిజానికి ఎన్నో సార్లు నాకు కూడా సభలో మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. నా కులంపై కూడా దాడి జరిగింది. కానీ నేను ఎప్పుడూ ఆ మాట మాట్లాడలేదు' అని ఖడ్గే అన్నారు. ఇతర సభ్యులకు రక్షణ కల్పించడమే చైర్‌పర్సన్ పని అని...అయితే తానే అలాంటి ప్రకటనలు చేస్తున్నారని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, హెూంమంత్రి అమిత్ షా పార్లమెంటు భద్రతా ఉల్లంఘన అంశంపై ఉభయ సభల్లో మాట్లాడకుండా బయట ప్రస్తావించినందుకు ప్రభుత్వం కూడా క్షమాపణలు చెప్పకూడదా అని ఖడ్గే ప్రశ్నించారు. రాజ్యాంగ పదవుల్లో ఉన్న వ్యక్తులు తమ కులాల గురించి మాట్లాడుకోవడం దేశానికి చాలా బాధాకరమైన రోజు అని కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ చౌదరి అన్నారు.

తేజస్వీ, లాలూ ప్రసాద్‌కు ఈడీ సమన్లు

న్యూఢిల్లీ: ఉద్యోగాల కోసం భూకుంభకోణం కేసులో మనీలాండరింగ్ విచారణకు సంబంధించి బీహార్ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్, ఆయన తండ్రి, ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్‌యాదవ్‌లకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమన్లు జారీ చేసింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద వాంగ్మూలాలు నమోదు చేసేందుకు డిసెంబర్ 22న తేజస్వీ యాదవ్‌ను విచారణకు హాజరుకావాలని ఆదేశించగా, లాలూ తన వాంగ్మూలాన్ని డిసెంబర్ 27న నమోదు చేయాల్సి ఉంది. యూపీఏ-1 ప్రభుత్వంలో లాలూ రైల్వే మంత్రిగా ఉన్న సమయంలో జరిగిన కుంభకోణం చుట్టూ ఈ దర్యాప్తు సాగుతోంది. 2004-2009 మధ్యకాలంలో, వివిధ భారతీయ రైల్వే జోన్‌లలో గ్రూప్ "డి" పోస్టుల్లో కొంతమంది వ్యక్తులను ఉద్దేశపూర్వకంగా నియమించగా... బదులుగా నియమితులైన వారు తమ భూమిని అప్పటి రైల్వే మంత్రి లాలూ కుటుంబ సభ్యులకు, ఆయనకు సంబంధించిన ఎకే ఇన్ఫోసిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు బదిలీ చేశారని ఆరోపణలున్నాయి.

మోదీపై పోటీకి ఇండియా కసరత్తు

న్యూఢిల్లీ: కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా ఇండియా కూటమి ముందుకు వెళుతోంది. బీజేపీ కంచుకోటలను బద్దలు కొట్టేం దుకు పావులు కదుపుతోంది. ఉమ్మడి కార్యా చరణతో ఎన్నికలకు వ్యూహాలు సిద్ధం చేస్తోంది. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిపై దృష్టిని కేంద్రీకరించింది. అక్కడ మోదీని ఓడించేందుకు కసరత్తు చేస్తోంది. ఇండియా కూటమి తరపున ఎవరిని బరిలోకి దించాలనే దానిపై సమాలోచనలు జరుపుతోంది. వారణాసిలో గెలుపును ఇండియా కూటమి సవాల్‌గా తీసుకుంది. తమ తరపు రాజకీయ తారల జాబితాను రూపొందిస్తోంది. ఇప్పటికే జేడీయూ అధ్యక్షుడు, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రాతో పాటు దిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ పేర్లను కొందరు ముఖ్యనాయకులు ప్రతిపాదించారు. 1952 నుంచి దశాబ్దం పాటు కాంగ్రెస్ ఈ స్థానానికి ప్రాతినిధ్యం వహించింది. అయితే 1991 నుంచి వారణా సిలో బీజేపీ గెలుస్తోంది. ఒక్క 2004లో మాత్రం ఓడిపో యింది. మోదీ వారణాసి నుంచి 2014-19లో లోక్‌సభకు ఎన్నికయ్యారు. రెండవ సారి 60శాతం ఓట్లు వచ్చాయి. దీంతో వారణాసిని మోదీ గుప్పెట్లో నుంచి లాక్కొనడ మన్నది ఇండియా కూటమికి పెద్ద సవాల్‌గా మారింది.

నితీశ్‌కుమార్: నితీశ్ కుమార్ ఓ దశలో బీజేపీకి మిత్రుడు. ప్రస్తుత ఇండియా కూటమి వ్యవ స్థాపకుల్లో ఒకరు. ప్రధాని అభ్యర్థిత్వానికి అర్హులు. 2014 ఎన్నికలకు ముందు ఈ పదవి కోసం ఈయ నను పరిగణించారు కూడా. నితీశ్‌ను ప్రధాని అభ్యర్థిగా ఇండియా కూటమి పరిగణించాలన్న పోస్ట ర్లు ఇటీవల పాట్నాలో వెలిశాయి. దీనికి జేడీయూ దూరంగా ఉన్నప్పటికీ అనేక ఊహాగానాలు వినిపించాయి.

ప్రియాంక గాంధీ వాద్రా: ప్రియాంక గాంధీ వాద్రా ఇప్పటివరకు ఎన్నికల్లో పోటీ చేయలేదు. 2019లో వారణాసిలో మోదీపై ప్రియాంక పోటీ చేస్తారన్న ఊహాగానాలు వచ్చాయి. కానీ కాంగ్రెస్ నిర్ణయం మార్చుకొని అజయ్ రాయ్‌ను బరిలోకి దించింది. ఆయన మూడవ స్థానంలో నిలిచారు. కానీ ఈసారి ప్రియాంకనే పోటీపై ఆసక్తిగా ఉండటం, ఆమె పేరును టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ ప్రతిపాదించడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

అరవింద్ కేజ్రీవాల్: అరవింద్ కేజ్రీవాల్‌ను వారణాసి బరిలోకి దించే అవకాశం ఇండియా కూటమికి లేకపోలేదు. ఈయన 2014లో ఇదే స్థానం నుంచి మోదీపై పోటీ చేసి రెండవ స్థానంలో నిలిచారు. అప్పట్లో రెండు లక్షలకుపైగా ఓట్లు (20శాతం) పొందారు. దీంతో రెండవ అవకాశం దక్కే ఆస్కారముంది.తాజా అసెంబ్లీ ఎన్నికల్లో మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ గెలవడంతో ఆ పార్టీ విజయోత్సాహంలో ఉంది. దానికి గండి కొట్టి సత్తా చాటడం ఇండియా కూటమికి సవాల్‌గా మారింది.

విజ్ఞాన ఖని రాంభట్ల

అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం: అభ్యుదయ సాహిత్య చిరస్మరణీయులు రాంభట్ల కృష్ణమూర్తి అని అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ కొనియాడారు. విశాలాంధ్ర 23వ పుస్తక మహోత్సవంలో భాగంగా స్థానిక లాడ్జీ సెంటర్ ఏఎల్ బీఎడ్ కళాశాల ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం నిర్వహిస్తున్న సాహిత్య కార్యక్రమాల్లో భాగంగా బుధవారం రాంభట్ల కృష్ణమూర్తి శత జయంతి విశేష సంచికను, ఆర్వీయార్(రాళ్లబండి వెంకటేశ్వరరావు) 85వ జయంతి విశేష సంచికల పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అరసంలో రాంభట్ల, ఆర్వీయార్ ఇద్దరూ కీలక పాత్ర పోషించారన్నారు. అరసం అభివృద్ధికి.. అభ్యుదయ సాహిత్య ఉద్యమ ప్రగతికి విశేష కృషి చేశారని కొనియాడారు. ఉత్తమ సాహిత్య వారసత్వాన్ని అందించినట్లు చెప్పారు. రాంభట్ల ఒక విజ్ఞాన ఖని అని, తెలుగునాట బడి చదువులు లేని బహుముఖ ప్రజ్ఞాశాలి అని తెలిపారు. ఆర్వీయార్ శతాధిక గ్రంథకర్త అని, ప్రసిద్ధ సాహిత్య విమర్శకులని వెల్లడించారు. వీరిద్దరూ అరసం ప్రధాన కార్యదర్శులుగా పనిచేసినట్లు చెప్పారు. అలాగే మార్క్సిస్ట్ దృక్పథంతో, నిబద్ధతతో సాహిత్యానికి అవిరళ కృషి చేసినట్లు చెప్పారు. హిందూ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు మాట్లాడుతూ నిబద్ధత, నైతిక విలువలు ఉన్న పెద్దల జీవిత విశేషాలను తెలుసుకోవడం అందరికీ అవసరమన్నారు. రాంభట్ల పాత్రికేయ రంగానికి దారిదీపంలా వెలుగునిచ్చారని, ఆ వెలుగును అందుకోవడం నేటి తరానికి అవసరమన్నారు. రాజకీయ కార్టూనిస్టుగా, గేయ కవిగా ఇంకా తెలుగులో ఉన్న వివిధ ప్రక్రియల్లో ఆయన అందవేసిన చెయ్యి అన్నారు. రాంభట్ల శతజయంతి విశేష సంచిక ఆయన జీవితాన్ని... వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తుందని అన్నారు. ప్రముఖ సాహితీవేత్త మోదుగుల రవికృష్ణ మాట్లాడుతూ రష్యాలో ఉద్యోగం చేసిన 10 ఏళ్లు తెలుగు వారికి చలివేంద్రంలాగా ఆర్వీయార్ వ్యవహరించారన్నారు. అనువాదం అయినప్పటికీ తెలుగు సహజత్వాన్ని కోల్పోని వాక్య విన్యాసంతో రష్యన్ అనువాద నవలలు అంటే అమితంగా ఇష్టపడే ఒక తరాన్ని ఆర్వీఆర్ తయారు చేసినట్లు చెప్పారు. శుద్ధ మార్క్సిస్ట్ అయినప్పటికీ సహేతుకమైన మంచి రచన అయితే ఇతర సిద్ధాంతాల రచనలను కూడా ఆయన అనువాదం చేసినట్లు తెలిపారు. కొకు శైలి మీద, కన్యాశుల్కంలోని భాష మీద ఆయన రాసిన వ్యాసాలు... సాహిత్య పరిశోధన, వ్యాసరచన రీతికి నమూనాల వంటివని ప్రశంసించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన అరసం రాష్ట్ర కార్యదర్శి శరశ్చంద్ర జ్యోతిశ్రీ మాట్లాడుతూ 1920లోనే రాంభట్ల శత జయంతి ఉత్సవాలు ప్రారంభమైనప్పటికీ కరోనా కారణంగా అర్ధాంతరంగా ముగిశాయని...ఆలస్యంగానైనా రాంభట్ల శత జయంతి ప్రత్యేక సంచికను తీసుకు రావటం ముదావహం అన్నారు. ఈ సంచికకు విశాలాంధ్ర సంపాదకులు ఆర్వీ రామారావ్ గౌరవ సంపాదకులుగా ఎన్నో విలువైన వ్యాసాలను ఏర్చి కూర్చారని తెలిపారు. ఇందులో 43 వ్యాసాలు ఉన్నాయన్నారు. వివిధ సాహితీ ప్రముఖులు రాంభట్ల కృష్ణమూర్తిపై రాసిన వ్యాసాలు ఉన్నాయని, అంతేకాకుండా రాంభట్ల వారి సుప్రసిద్ధ గేయాలు, రాజకీయ వ్యంగ్య చిత్రాలు, గురజాడ వర్ణచిత్రం... సంచికకు మరింత వన్నె తెచ్చినట్లు చెప్పారు. ఆర్వీయార్ విశేష సంచికకు దారిదీపం ప్రధాన సంపాదకులు డీవీవీఎస్ వర్మ సంపాదక బాధ్యతలు నిర్వహించారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మోదుగుల రవికృష్ణ, డా॥ యల్లాప్రగడ మల్లికార్జునరావు, కె.శరచ్చంద్ర జ్యోతిశ్రీ, పెనుగొండ లక్ష్మీనారాయణ

అంగన్‌వాడీల ఉద్యమ హోరు

- వినూత్న నిరసనలతో 9వ రోజుకి చేరిన ఆందోళనలు
- ప్రభుత్వ మెమోలకు బెదిరేది లేదు: రవీంద్రనాథ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అంగనవాడీల ఉద్యమం హోరెత్తుతోంది. వంటావార్పు, భిక్షాటన, మోకాళ్లపై నడక వంటి వినూత్న నిరసనలతో అంగన్‌వాడీ వర్కర్లు, సహాయకులు చేస్తున్న ఆందోళనలు బుధవారం 9వ రోజుకి చేరుకున్నాయి. దీనిలో భాగంగా ఏలూరు జిల్లా కలెక్టరేట్ వద్ద వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. ఇక్కడ ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్ని కుట్రలు పన్నినా వెనక్కి తగ్గేదే లేదని, ఐకమత్యంతో తిప్పికొడతామని హెచ్చరించారు. సుప్రీంకోర్టు తీర్పుప్రకారం కనీస వేతనాలు రూ.26 వేలు ఇవ్వాలన్న సూచనను అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. అంగన్వాడీలు గొంతెమ్మ కోరికలు కోరడం లేదని, ఎన్నికల ముందు వారు ఇచ్చిన హామీలు అమలు చేయాలని మాత్రమే కోరుతున్నారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి వల్ల రాష్ట్రంలో ఉన్న 55,605 అంగన్వాడీ కేంద్రాలు మూతపడ్డాయని, లక్ష మందికి పైగా అంగన్వాడీ మహిళలు వీధులలోకి వచ్చే పరిస్థితిని వైసీపీ ప్రభుత్వం కల్పించిందని మండిపడ్డారు. తమ ఆవేదనను వెలిబుచ్చుతూ అంగన్వాడీలు, ఆయాలు చేస్తున్న నినాదాలతో దిక్కులు పిక్కటిల్లుతున్నా ముఖ్యమంత్రి స్పందించకపోవడం ఆయన నియంతృత్వ ధోరణిని తేటతెల్లం చేస్తున్నదన్నారు. ఒకవైపు చర్చలకు ఆహ్వానిస్తూ రెండోవైపు ప్రభుత్వ అధికారులు అంగన్వాడీ సెంటర్ల తాళాలు పగలగొట్టడమేమిటని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వమే నేరుగా తాళాలు పగలగొట్టడం, అన్ని విభాగాల వాళ్లని రంగంలోకి దించటం వల్ల వ్యవస్థలు కుంటుపడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి భేషజాలకు పోకుండా ఇచ్చిన హామీ మేరకు అంగన్వాడీల న్యాయమైన సమస్యలు తక్షణం పరిష్కరించాలని, లేనిపక్షంలో మహిళల ఆగ్రహానికి మసికావల్సి వస్తుందని రవీంద్రనాథ్ హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, కోశాధికారి పుప్పాల కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

సీఎం నిరంకుశ వైఖరి విడనాడాలి: ఈశ్వరయ్య

అంగన్‌వాడీలు చేస్తున్న న్యాయమైన పోరాటాన్ని పరిష్కరించాల్సిన ముఖ్యమంత్రి, అణచివేయాలని చూడడం దుర్మార్గమని సీపీఐ రాష్ట్రకార్యదర్శివర్గసభ్యులు జి.ఈశ్వరయ్య మండిపడ్డారు. కమలాపురం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు భిక్షాటన చేస్తూ వినూత్న నిరసన చేపట్టారు. ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు పి.చంద్రశేఖర్, కామనూరు శ్రీనివాసులు అధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో ఈశ్వరయ్య మాట్లాడుతూ 9 రోజులుగా మహిళలు రోడ్డెక్కి ఆందోళన చేస్తుంటే ముఖ్యమంత్రి బాధ్యత మరచి, ఉద్యమాన్ని అణచివేసేందుకు ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. ఇకనైనా కక్ష సాధింపు చర్యలు మాని సమ్మె పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఏఐటీయూసీ నాయకులు నాగేశ్వరరావు,రాణి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచేవరకు సమ్మె ఆగదు: లలితమ్మ

ఇచ్చిన హామీ మేరకు వేతనాలు పెంచేవరకు సమ్మె ఆగదని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.లలితమ్మ స్పష్టం చేశారు. నంద్యాల జిల్లా నందికొట్కూరు పట్టణ వీధుల్లో అంగన్‌వాడీలు బుధవారం భిక్షాటనతో నిరసన కార్యక్రమం చేపట్టారు. లలితమ్మ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు మేరకు వేతనాలు పెంచాలని, గ్రాట్యూటీ చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సమ్మె పరిష్కారానికి చర్యలు తీసుకోకుండా బెదిరింపులకు దిగితే చలో విజయవాడకు పిలుపునిస్తామని హెచ్చరించారు. ఏఐటీయూసీ నాయకులు రఘురాం మూర్తి, ఎం.రమేశ్‌బాబు, పుణ్యవతి, కమలమ్మ, సువర్ణ, కాత్యాయని, ఎస్ఎఫ్ నాయకులు శ్రీనివాసులు, దినేశ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

హామీ ఇచ్చి మోసగించడం తగదు: కేవీవీ ప్రసాద్

అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలు అమలు చేయకుండా అంగన్‌వాడీలను మోసగించడం తగదని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కేవీవీ ప్రసాద్ సీఎంకు హితవు చెప్పారు. ఆయన తాడికొండలో అంగన్‌వాడీలు చేస్తున్న ఉద్యమ శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. సీపీఐ నాయకులు ముప్పాళ్ల శివశంకరరావు, రైతుసంఘం నాయకులు చింతల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సాత్విక్ జోడీకి ఖేల్‌రత్న పురస్కారం

మహ్మద్ షమీకి అర్జున అవార్డు

జాతీయ క్రీడా అవార్డుల ప్రకటన

న్యూఢిల్లీ: కేంద్రప్రభుత్వం జాతీయ క్రీడా అవార్డులను ప్రకటించింది. 2023 సంవత్సరానికి గాను భారత స్టార్ బ్యాడ్మింటన్ జోడీ సాత్విక్ సాయిరాజ్- చిరాగ్ శెట్టి దేశ అత్యున్నత క్రీడా పురస్కారం మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న అందుకోనున్నారు. అర్జున అవార్డుకు 26 మంది, ద్రోణాచార్య అవార్డు రెగ్యులర్ కేటగిరీలో ఐదుగురు ఎంపికయ్యారు. టీమిండియా సీనియర్ పేసర్ మహ్మద్ షమీకి అర్జున అవార్డు పురస్కారం దక్కింది. వీరంతా ఈ పురస్కారాలను వచ్చే ఏడాది జనవరి 09న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అందుకోనున్నారు. ఈ మేరకు కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

అర్జున అవార్డు గ్రహీతలు...

ఓజస్ ప్రవీణ్ (అర్చరీ), అదితి గోపీచంద్ స్వామి (అర్చరీ), శ్రీశంకర్ ఎం (అథ్లెటిక్స్), పారుల్ చౌదరి (అథ్లెటిక్స్), మహ్మద్ హుసాముద్దీన్ (బాక్సింగ్), ఆర్ వైశాలి (చెస్), మహ్మద్ షమి (క్రికెట్), అనూష్ అగర్వాలా (ఈక్వస్ట్రియన్), దివ్యకృతి సింగ్ (ఈక్వస్ట్రియన్ డ్రస్సెజ్), దీక్షా దాగర్ (గోల్ఫ్), క్రిషన్ బహదూర్ పాఠక్ (హాకీ), సుశీల చాను (హాకీ), పవన్ కుమార్ (కబడ్డీ), రితూ నేగి (కబడ్డీ), నస్రీన్ (ఖో ఖో), పింకి (లాన్ బౌల్స్), ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్ (షూటింగ్), ఇషా సింగ్ (షూటింగ్), హరీందర్ పాల్ సింగ్ సంధు (స్క్వాష్), అహికా ముఖర్జీ (టేబుల్ టెన్నిస్), సునీల్ కుమార్ (రెజ్లింగ్), అంతిమ్ (రెజ్లింగ్), నౌరెమ్ రోషిబినా దేవి (వు షూ), శీతల్ దేవి (పారా అర్చరీ), అజయ్‌రెడ్డి (అంధుల క్రికెట్), ప్రాచీ యాదవ్ (పారా కానోయింగ్).

ద్రోణాచార్య అవార్డు గ్రహీతలు

రెగ్యులర్ కేటగిరీ: లలిత్ కుమార్ (రెజ్లింగ్), ఆర్.బి.రమేశ్ (చెస్), మహవీర్ ప్రసాద్ సైని (పారా అథ్లెటిక్స్), శివేంద్ర సింగ్ (హాకీ), గణేష్ ప్రభాకర్ (మల్లఖాంబ్).

లైఫ్‌టైమ్ కేటగిరీ: జస్కీరత్ సింగ్ గ్రేవాల్ (గోల్ఫ్), భాస్కరన్ ఈ (కబడ్డీ), జయంత కుమార్ పుషీలాల్ (టేబుల్ టెన్నిస్).

జీవిత సాఫల్య పురస్కారం 2023: మంజుషా కన్వర్ (బ్యాడ్మింటన్), వినీత్ కుమార్ శర్మ (హాకీ), కవిత సెల్వరాజ్ (కబడ్డీ).

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.